aruhi
aruhi group
MAHAA PRABHA NEWS
Delivering truth with integrity – the voice of the people.
Email : info@mahaaprabha.com
www.mahaaprabha.com - 9160600610
VINTAARA INSTITUTE OF TECHNOLOGY
Build Your Dream Career
ADMISSION OPEN
BEST OPTIONS TO LEARN IN HYDERABAD
9160600630 & 9640123485
HYDERABAD & VIJAYAWADA & VISAKHAPATNAM & GUNTUR


# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

మంగళవారం 05-05-2026 సంపుటి : 01 సంచిక : 44 పేజీలు : 08 వెల : ₹ 5/-

తెలుగు దినపత్రిక


BESQATI
besqati.com
Contact : info@besqati.com

Published From RANGAREDDY,TELANGANA.తెలంగాణ mahaaprabha.com NAMASTEY MAHAAPRABHA RNI NO : TGTEL/26/A0738 info@mahaaprabha.com

- ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో సంచలనాలు నమోదు
- ద్రవిడ నేలపై ఎగ్జిట్‌పోల్ అంచనాలు తలకిందులు
- తొలి ఎన్నికల్లోనే 'జననాయగన్' జయకేతనం
- 107 సీట్లతో అతిపెద్ద పార్టీగా టీవీకే అవతరణ
- సిట్టింగ్‌స్థానం కొళత్తూర్‌లో స్టాలిన్‌కు ఎదురుదెబ్బ
- వెస్ట్ బెంగాల్‌లో తొలిసారి పాగా వేసిన బీజేపీ
- భవానీపూర్ స్థానంలో మమతకు పరాజయం
- కేరళలో లెఫ్ట్‌కు షాక్.. యూడీఎఫ్‌కు పగ్గాలు
- అస్సాంలో కమలం.. పుదుచ్చేరిలో ఎన్నార్ కాంగ్రెస్
- శిష్యుడి చేతిలో రెండోసారి పరాజయం
- 35 ఏండ్లలో తొలిసారి ఓటమిపాలు

# విజయ్ విహారం

## తమిళనాట టీవీకే సంచలనం.. బెంగాల్‌లో ఓడిన తృణమూల్



పశ్చిమ బెంగాల్ (293/294)

| కూటమి పార్టీలు | 2026 | 2021 | తేడా |
|---|---|---|---|
| బీజేపీ+ | 206 | 77 | +129 |
| టీఎంసీ+ | 81 | 214 | -133 |
| కాంగ్రెస్ | 2 | 0 | +2 |
| ఇతరులు | 4 | 2 | +2 |

★ మ్యాజిక్‌ఫిగర్ - 148

తమిళ నాడు (234)

| కూటమి పార్టీలు | 2026 | 2021 | తేడా |
|---|---|---|---|
| టీవీకే | 107 | - | +107 |
| డీఎంకే+ | 74 | 159 | -85 |
| ఏఐడీఎంకే+ | 53 | 75 | -22 |
| ఇతరులు | 1 | 0 | +1 |

★ మ్యాజిక్‌ఫిగర్ - 118

కేరళ (140)

| కూటమి పార్టీలు | 2026 | 2021 | తేడా |
|---|---|---|---|
| యూడీఎఫ్ | 99 | 40 | +59 |
| ఎల్డీఎఫ్ | 35 | 92 | -57 |
| బీజేపీ+ | 3 | 0 | +3 |
| ఇతరులు | 3 | 8 | -5 |

★ మ్యాజిక్‌ఫిగర్ - 71

అస్సాం (126)

| కూటమి పార్టీలు | 2026 | 2021 | తేడా |
|---|---|---|---|
| బీజేపీ+ | 102 | 73 | +29 |
| కాంగ్రెస్+ | 21 | 31 | -10 |
| ఏఐయూడీఎఫ్+ | 2 | 16 | -14 |
| ఇతరులు | 1 | 6 | -5 |

★ మ్యాజిక్‌ఫిగర్ - 64

పుదుచ్చేరి (30)

| కూటమి పార్టీలు | 2026 | 2021 | తేడా |
|---|---|---|---|
| ఎన్నార్ కాంగ్రెస్ | 18 | 16 | +2 |
| కాంగ్రెస్+ | 6 | 8 | -2 |
| టీవీకే+ | 3 | - | +3 |
| ఇతరులు | 3 | 6 | -3 |


★ మ్యాజిక్‌ఫిగర్ - 16

ద్రవిడ రాజకీయాల తమిళనాట యువటోర్నడో ఆవిర్భవించింది. బెంగాల్‌లో తుఫాన్ ధాటిని 'గడ్డిపువ్వు' తట్టుకోలేకపోయింది. పదేండ్ల తర్వాత కేరళలో వామపక్ష కూటమి ప్రభుత్వం నుంచి పక్కకు తప్పుకొని, పాత ఆనవాయితీకి మళ్లీ ప్రాణంపోసింది. నాలుగు రాష్ట్రాలు, ఓ కేంద్రపాలిత ప్రాంతానికి సోమవారం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో సంచలనాలు నమోదయ్యాయి. ఓటరు తీర్పునకు ముగ్గురు ముఖ్యమంత్రులు గద్దె దిగారు. అస్సాంలో మూడోసారి బీజేపీ జెండా ఎగురవేయగా, పుదుచ్చేరిలో ఎన్నార్సీ కూటమి మరోసారి గెలుపొందింది.

న్యూఢిల్లీ: 4 మే (మహాప్రభ)

3 లో





దీదీ కంచుకోట బద్దలు

## కేరళలో ఫలించిన సీఎం
# రేవంత్ వ్యూహాలు

- అధిష్ఠానం వద్ద పెరిగిన సీఎం గ్రాఫ్
- యూడీఎఫ్ విజయం వెనుక ఉన్న ఫలితాలు ఇవే
- దీంతో కాంగ్రెస్‌లో పవర్ ఫుల్ లీడర్‌గా రేవంత్ రెడ్డి

హైదరాబాద్ 4 మే ( మహాప్రభ) దేశరాజకీయాల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరు మరోసారి చర్చనీయాంశంగా మారింది. కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) విజయం వెనుక రేవంత్ రెడ్డి అనుసరించిన వ్యూహాలు హస్తం పార్టీలో ఆసక్తిని రేపుతున్నాయి. ఈ దెబ్బతో రేవంత్ రెడ్డి ఇమేజ్ మరోసారి కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద మరింత పెరిగినట్లు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. తనకు ఇచ్చిన అవకాశాన్ని వాడుకుని ఎల్డీఎఫ్ ప్రభుత్వాన్ని గద్దె దించడంలో రేవంత్ రెడ్డి పోషించిన పాత్ర గేమ్



ఛేంజర్ గా మారిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ముఖ్యంగా పీసీసీ అధ్యక్షుడిగా

-మిగతా 3 లో



## వాంఖడేలో ముంబై
# సునామీ బ్యాటింగ్.

- రోహిత్, రికెల్టన్ విధ్వంసంతో 229 టార్గెట్‌ను ఊదేశారు!
- వాంఖడేలో కమ్ బ్యాక్ ఇచ్చిన ముంబై ఇండియన్స్
- 83 పరుగులతో రికెల్టన్, 84 పరుగులతో రోహిత్ విధ్వంసం
- సీజన్‌లో మూడో విజయాన్ని నమోదు చేసిన ముంబై

న్యూఢిల్లీ: 4 మే ( మహాప్రభ)

ముంబై ఇండియన్స్ అంటే ఏంటో ఇన్నాళ్లు చూయించారు. ఐపీఎల్ 2026 సీజన్ ముగింపు దశకు వస్తున్న సమయంలో ముంబై ప్లేయర్లు ఫామ్‌లోకి వచ్చారు. బౌలింగ్‌లో ఆరంభంలో తడబడిన ముంబై.. ఆఖర్లో అద్భుతంగా బంతులు వేసి లక్నోని 250 టచ్ చేయకుండా చేసింది. ఇక బ్యాటింగ్‌లో గాయపడ్డ సింహంలా రోహిత్ శర్మ కమ్ బ్యాక్ ఇన్నింగ్స్‌తో లక్నో బౌలర్లకు చుక్కలు చూపెట్టాడు. ర్యాన్ రికెల్టన్ విరుచుకుపడటంతో ఓపెనర్లు ఇద్దరే ముంబైను విజయతీరాలకు చేర్చారు.వాంఖడే వేదికగా జరిగిన హై ఓల్టేజ్ మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ - ముంబై ఇండియన్స్ పోటాపోటీగా బ్యాటింగ్ చేసింది. లక్నో అందించిన 229 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్‌ను ఓపెనర్లు రోహిత్ శర్మ, ర్యాన్ రికెల్టన్ అద్భుతంగా నడిపించారు.

-మిగతా 3 లో

## త్వరలో మంత్రివర్గ
# విస్తరణ?

### తెలంగాణ క్యాబినెట్ విస్తరణ ఈసారి రెడ్లకు నో ఛాన్స్

- గతంలోనే సీఎం, ఏఐసీసీ నేతల మధ్య చర్చ
- బీసీల్లో ఒకరికి మంత్రి పదవి ఖాయం?
- ఎస్టీల్లో ఒకరికి అవకాశం

హైదరాబాద్ 4 మే ( మహాప్రభ)

రాష్ట్ర మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న రెండు బెర్తులు బీసీ, ఎస్టీకి దక్కే అవకాశాలున్నాయి. ఇంకో రెడ్డి సామాజికవర్గానికి ఇచ్చేది లేదని ఏఐసీసీ, ఇటు ముఖ్యమంత్రి ఏకాభిప్రాయంతో ఉన్నట్లు ఢిల్లీ కాంగ్రెస్ వర్గాల సమాచారం. ప్రస్తుత మంత్రివర్గంలో ఇద్దరు లేదా ముగ్గురిని తొలగించి వారి స్థానంలో కొత్త ముఖాలకు అవకాశం ఇవ్వొచ్చనే ఊహాగానాలు కొన్ని రోజులుగా వినిపిస్తున్నాయి.

-మిగతా 3 లో



## 'దేశమంతా
# మోడీ మయం'

- 21కి చేరిన ఎన్డీయే పాలిత రాష్ట్రాలు
- బెంగాల్ ఫలితాలపై బీజేపీ ఆసక్తికర పోస్ట్
- ఎన్డీయే పాలిత రాష్ట్రాలను చూపిస్తూ ఇండియా మ్యాప్ విడుదల




న్యూఢిల్లీ: 4 మే ( మహాప్రభ)

బెంగాల్‌లో బీజేపీ ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు తగ్గట్టుగానే ఫలితాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో బీజేపీ ఒక ఆసక్తికర పోస్ట్‌ను విడుదల చేసింది. కాషాయం బీజేపీకు చెందిందని, ఇక భారత్ అంతా మోడీ మయం అంటూ తెలిపింది. బీజేపీ, దాని మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలను కాషాయం కలర్‌తో చూపిస్తూ ఇండియా మ్యాప్‌ను ఎక్స్‌లో పోస్ట్ చేసింది. 'దేశ కేంద్రం (ఢిల్లీ) నుంచి బెంగాల్ వరకు,

-మిగతా 3 లో

## రాష్ట్రంలో క్షీణించిన
# శాంతిభద్రతలు

- ప్రభుత్వానిది మొద్దు నిద్ర
- కరీంనగర్ దోపిడీ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మంత్రులెక్కడీ బండి సంజరు వైఖరిపై విమర్శ

కరీంనగర్ 4 మే ( మహాప్రభ)

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, నేరాల్లో రాష్ట్రం బీహార్, ఉత్తరప్రదేశ్‌తో పోటీ పడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కరీంనగర్‌లోని పీఎంజే జ్యువెల్లరీ షాపులో జరిగిన దోపిడీ, కాల్పుల నేపథ్యంలో సోమవారం ఆయన ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన అనంతరం

-మిగతా 3 లో





## అసాధ్యమైన యుద్ధమా?
# ఒప్పందమా?

- అమెరికాకు వేరే దారులు లేవన్న ఇరాన్ నాయకత్వం
- పద్నాలుగు పాయింట్లతో కొత్త శాంతి ప్రతిపాదన
- దురుసుగా ప్రవర్తిస్తే మళ్లీ దాడులు: డొనాల్డ్ ట్రంప్

టెహ్రాన్ 4 మే ( మహాప్రభ)

అమెరికాపై ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ (ఐఆర్‌జీసీ) తన మాటల దాడిని ఉధృతం చేసింది. ఇరాన్‌ను ఎదుర్కోవడంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందు చాలా పరిమితమైన, క్లిష్టమైన దారులు ఉన్నాయని ఐఆర్‌జీసీ హెచ్చరించింది. సాధ్యంకాని ఆపరేషనా లేక ఇరాన్‌తో ఒక చెడ్డ ఒప్పందమా అన్న దాంట్లో ఒకదాన్ని ట్రంప్ ఎంచుకోవాలని ఐఆర్‌జీసీ నిఘా విభాగం ఒక ప్రకటనలో పేర్కొన్నట్లు ఇరానియన్ ప్రభుత్వ టీవీ తెలిపింది. ఈ హెచ్చరిక రెండు దేశాల మధ్య, ముఖ్యంగా ఆ ప్రాంతంలో అమెరికా సైనిక ఒత్తిడి విషయంలో పెరుగుతున్న ఉద్రిక్తతలను ప్రతిబింబిస్తున్నది. ఐఆర్‌జీసీ ఎక్స్‌లో పెట్టిన ఒక పోస్టులో ఇవే వ్యాఖ్యలు మరోసారి వెలువడ్డాయి.

-మిగతా 3 లో

## ఒక్క రాత్రి నగ్న పూజలో పాల్గొంటే 30 లక్షలు ఇస్తా..

### బెంగళూరు యువతికి వేధింపులు




**న్యూఢిల్లీ, 4 మే (మహాప్రభ)**

ఒక్క రాత్రి నగ్నంగా పూజలో కూర్చుంటే రూ.30లక్షలు ఇస్తానని యువతిని ఓ వ్యక్తి వేధింపులకు గురిచేశాడు. జ్యోతిష్యుడిని అని చెప్పుకుంటూ అసభ్యకర మెసేజ్‌లు పంపించాడు. దక్షిణ బెంగళూరులోని రామనగర తాలుకా పెద్దమన్నుగుడ్డెలో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళ్తే.. కిరణ్ అనే యువకుడు తనను తాను ఓ జ్యోతిష్యుడిని అని.. బెంగలూరులో ప్రత్యేక పూజలు చేస్తుంటానని ఓ యువతిని సంప్రదించాడు. గత నెల 12వ తేదీన సదరు యువతికి కిరణ్ ఫోన్ చేసి.. మనీ డబ్లింగ్ ( డబ్బును రెట్టింపు చేసే) పూజ చేస్తున్నామని.. ఆ పూజ వివరాలను వెల్లడించారు. ఆ పూజలో పాల్గొనేందుకు యువతిని ఎంపిక చేస్తున్నామని.. శరీరంపై పుట్టు మచ్చలు ఉంటే పూజకు పనికిరారు అని వివరించాడు. నిన్ను ఎంపిక చేయాలంటే ముందుగా నగ్నంగా ఉన్న ఫొటో పంపించాలని ఒత్తిడి చేశాడు. పూజ పూర్తయ్యాక రూ.30లక్షలు ఇస్తానని కూడా ప్రలోభపెట్టాడు. ఈ ఘటనపై బాధితురాలు తన తల్లితో కలిసి రెండు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయినప్పటికీ ఇంకా నిందితుడిని అరెస్టు చేయలేదని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. ఈ ఘటనపై వెంటనే చర్యలు తీసుకుని.. నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరింది.

## దేశంలో కమ్యూనిస్టుల పాలన కనుమరుగు..!



**హైదరాబాద్ 4 మే (మహాప్రభ)**

ఇటీవల ఐదు రాష్ట్రాలకు నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో దేశ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ఎన్నో పార్టీలు పురుడు పోసుకొని రాజకీయాల్లో తమ అస్థిత్వాన్ని చాటుకుంటున్నాయి. ఈ క్రమంలో కేరళలో ఎల్డీఎఫ్ కూటమి ఓడిపోవడంతో దేశంలో కమ్యూనిస్టుల పాలనకు తెరపడినట్లయింది. 1957లోఈఎంఎస్ నంబూద్రిపాద్ నాయకత్వంలో కేరళలో ప్రపంచంలోనే మొదటిసారిగా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన కమ్యూనిస్ట్ ప్రభుత్వం ఏర్పడింది.అప్పటి నుంచి కేరళ, పశ్చిమ బెంగల్, త్రిపుర ఇలా 49 ఏండ్ల ఏండ్లలో ఏదో ఒక చోట గెలుస్తూ అధికారాన్ని కాపాడుకుంటూ వస్తున్నది. అయితే, 2026 ఏప్రిల్‌లో కేరళతో పాటు మరో నాలుగు రాష్ట్రాలకు ఎన్నికలు జరిగాయి. కేరళలో మొన్నటి వరకు సీపీఎం పార్టీ నాయకుడు పినరయి విజయన్ నాయకత్వంలో ఆ పార్టీ వరుసగా రెండు సార్లు గెలిచి పాలన సాగిస్తున్నది. ఈ రోజు వెలువడిన ఫలితాల్లో కేరళలో ఎల్డీఎఫ్ కూటమి ఘన విజయం సాధించింది. దీంతో కేరళలలో అధికారంలోకి వచ్చిన వామపక్షాలు కేరళలలో ఓటమితోనే తన ప్రస్థానాన్ని ముగించినట్లయింది.

## కేరళలో మూడు సీట్లు గెల్చుకున్న బిజెపి




**తిరువనంతపురం 4 మే (మహాప్రభ)**

కేరళలో పదేళ్ల తర్వాత భాజపా ఖాతా తెరచింది. నేమోం, చాతన్నూర్, కాళకూటం అసెంబ్లీ నియోజకవర్గాలను కైవసం చేసుకుంది. తమకు ఒక్క సీటు కూడా రాదని కాంగ్రెస్, సీపీఎంలు చేసిన వ్యాఖ్యలకు ఈ ఫలితాలే సమాధానమని కాషాయ పార్టీ కేరళ అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ అన్నారు. కేంద్ర మంత్రి జార్జ్ కురియన్ తాను పోటీ చేసిన కంజిరప్పల్లిలో మూడో స్థానంలో నిలిచారు. నేమోం స్థానంలో రాజీవ్ చంద్రశేఖర్ తన సమీప అభ్యర్థిపై 4,978 ఓట్ల తేడాతో గెలుపొందారు. చాతన్నూర్‌లో బీబీ గోపకుమార్ 4,398 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. కాళకూటంలో కేంద్ర మాజీ మంత్రి వి.మురళీధరన్ 428 ఓట్ల తేడాతో గ్టటెక్కారు. కేరళ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి భాజపా తొలిసారి 2016లో ఓ సీటు సాధించింది. నేమోం నియోజకవర్గం నుంచి సీనియర్ నేత రాజగోపాల్ గెలిచారు. 2021లో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా రాలేదు. కేరళలో మొత్తం 140 స్థానాలు ఉండగా.. తాజా ఫలితాల్లో 102 స్థానాల్లో విజయంతో యూడీఎఫ్ సెంచరీ కొట్టినట్లయ్యింది. 2021 ఎన్నికల్లో 62 స్థానాల్లో గెలిచిన ఎల్డీఎఫ్.. ఈ సారి 35కే పరిమితమైంది. ధర్మదం నుంచి పోటీ చేసిన సీఎం పినరయి విజయ్ 19,247 ఓట్ల తేడాతో గెలుపొందారు.

## టివికె గెలుస్తుందని ముందే చెప్పాం

-మా ఎగ్జిట్ పోల్స్ ఖచ్చింతంగా పనిచేసాయి
-మా అంచనాలను చాలామంది తప్పు పట్టారు
-యాక్సిస్ మై ఇండియా చీఫ్ ప్రదీప్ గుప్తా






**న్యూఢిల్లీ, 4 మే (మహాప్రభ)**

తమిళనాట తొలిసారిగా అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచిన విజయ్ సారథ్యంలోని టీవీకే పార్టీ ప్రస్తుతం 100కు పైగా స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. అధికారాన్ని నిలబెట్టుకుంటుందని అనుకున్న డీఎమ్‌కే మాత్రం వెనుకంజలో ఉంది. ఈ నేపథ్యంలో యాక్సిస్ మై ఇండియా చీఫ్ ప్రదీప్ గుప్తా సోమవారం జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కీలక వ్యాఖ్యలు చేశారు. టీవీకే పార్టీ 98కి పైగా స్థానాల్లో గెలుస్తుందని తాము ఎగ్జిట్ పోల్స్‌లో అంచనా వేస్తే అంతా నవ్వారని అన్నారు. కానీ చివరకు తమ అంచనాలే నిజమవుతున్నాయని చెప్పారు. అయితే, ఈ విజయం తమది కాదని, డేటా సైన్స్‌ది అని ఆయన వ్యాఖ్యానించారు. 'టీవీకే విజయంపై మా అంచనాను దేశవ్యాప్తంగా ఎవ్వరూ నమ్మలేదు. అలా జరగదని అంటూ మా అంచనాను కొట్టిపారేశారు. రాజకీయ విశ్లేషకులు, పరిశీలకులు, ఇతర పోలింగ్ ఏజెన్సీలు అంతా మమ్మల్ని చూసి నవ్వారు' అని అన్నారు. డీఎమ్‌కే ప్రభావాన్ని యాక్సిస్ మై ఇండియా ఎక్కువగా అంచనా వేసిందా? అన్న ప్రశ్నకు గుప్తా స్పందిస్తూ డీఎమ్‌కేకు 35 శాతం ఓట్లు రావచ్చని తాము భావించినట్లు చెప్పారు. ప్రస్తుతం 32 శాతంగా ఉందని అన్నారు. ఇక తమ అంచనాకు అనుగుణంగా టీవీకే ఇప్పటివరకూ 35 శాతం ఓట్లు సాధించిందని చెప్పారు. అన్నాడీఎమ్‌కేకు 23 శాతం ఓట్లు వస్తాయని తాము అంచనా వస్తే ప్రస్తుతం వారి వాటా 27 శాతంగా ఉందని అన్నారు. రెండో స్థానంలో స్టాలిన్, మూడో స్థానంలో పళనిస్వామి ఉంటారని తాము నమ్ముతున్నామని అన్నారు. ఫలితాలు వెలువడ్డాక పూర్తి స్పష్టత వస్తుందని చెప్పారు. యువతరం విజయ్‌కు మద్దతు పలకడంతో టీవీకే విజయబావుటా ఎగురవేసిందని చెప్పారు. 18 ఏళ్ల నుంచి 39 ఏళ్ల మధ్య ఉన్న వారు విజయ్‌కు పట్టం కడతారని తాము అంచనా వేశామని అన్నారు. ఈ వయసుల్లోని వారి వాటా తమిళనాడులో 42 శాతంగా ఉందని అన్నారు. 40 ఏళ్లు పైబడిన వారు కూడా చెప్పుకోదగ్గ సంఖ్యలోనే విజయ్‌కు జైకొట్టారని అన్నారు. అత్యధిక శాతం మహిళల ఓట్లు దక్కించుకున్న పార్టీగా డీఎమ్‌కే తరువాత టీవీకే నిలుస్తుందని కూడా చెప్పారు. అయితే, తమిళనాట మేజిక్ ఫిగర్ అయిన 118 స్థానాలను టీవీకే గెలుచుకోలేని పక్షంలో పార్టీ అధినేత విజయ్ ఏం చేస్తారన్న దానిపై ప్రస్తుతం సర్వత్రా ఆసక్తి నెలకొంది.

### చొరబాటుదారులు, వారి మద్దతుదారులకు బెంగాల్

## ప్రజలు గుణపాఠం చెప్పారు




**న్యూఢిల్లీ, 4 మే (మహాప్రభ)**

పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంపై బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పందించారు. దేశంలోకి అక్రమ చొరబాటుదారులు, వారి మద్దతుదారులకు బెంగాల్ ప్రజలు గుణపాఠం చెప్పారని అమిత్ షా అన్నారు. బెంగాల్ విజయంపై సోమవారం అమిత్ షా స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు.:"అక్రమ చొరబాటుదారులు, వారి సానుభూతిపరులకు బెంగాల్ ప్రజలు గుణపాఠం చెప్పారు. ఇలాంటి అంశాల్లో బుజ్జగింపు రాజకీయం చేస్తున్న వారిని సహించబోమనే స్పష్టమైన సందేశాన్ని ప్రజలు ఇచ్చారు. మోదీ నాయకత్వంపై బెంగాల్ ప్రజలు నమ్మకంతో ఎన్నో ఆశలు, ఆకాంక్షల్ని కలిగి ఉన్నారు. ప్రజల ఆకాంక్షల్ని బీజేపీ నెరవేరుస్తుంది., సోనార్ బంగ్లా ప్రజల ఆకాంక్షల్ని నెరవేర్చేందుకు బీజేపీ రాత్రీ పగలు పని చేస్తుంది. బెంగాల్ వైభవాన్ని తిరిగి తెస్తాం. చైతన్య మహాప్రభు, స్వామి వివేకానంద, రవీంద్రనాథ్ ఠాగూర్, సుభాష్ చంద్రబోస్, శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వంటి వారి కీర్తిని నిలబెడతాం" అని అమిత్ షా తన సోషల్ మీడియా వేదికగా స్పందించారు. పశ్చిమ బెంగాల్‌లో అమిత్ షా విస్తృత ప్రచారం నిర్వహించారు. ఎక్కువ రోజులు రాష్ట్రంలోనే ఉండి, అనేక నియోజకవర్గాల్లో పర్యటించారు. ముఖ్యంగా రాష్ట్రంలోనే ఉంటూ రాజకీయ పరిస్థితుల్ని సమీక్షించారు. బెంగాల్‌లో బీజేపీ విజయంలో మోదీతో కలిసి కీలక పాత్ర పోషించారు. తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కూటమి పశ్చిమ బెంగాల్, అసోం, పుదుచ్చేరిలో ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే.

## ప్రజల తీర్పును అంగీకరిస్తున్నాం..

### నా రాజకీయ జీవితంలో గొప్ప విజయాలు, ఓటములు చవిచూశా..!



**న్యూఢిల్లీ, 4 మే (మహాప్రభ)**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో రెండోసారి తమదే అధికారం అనుకున్న ద్రవిడ మున్నేట్ర కజగం పార్టీకి చుక్కెదురైంది. ఎన్నికల్లో ప్రజలు ఏకపక్ష తీర్పు ఇస్తారని ఊహించని సీఎం ఎంకే స్టాలిన్ భావోద్వేగంతో ఓటమిపై స్పందించారు. ప్రజల తీర్పును అంగీకరిస్తున్నామని పేర్కొన్న డీఎంకే అధినేత.. టీవీకే పార్టీ పేరెత్తకుండానే విజేతలకు అభినందనలు తెలిపారు.అసెంబ్లీ ఎన్నికల్లో భారీ పరాజయంతో కంగుతిన్న స్టాలిన్ ఎక్స్ పోస్ట్‌లో రాష్ట్ర ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఎక్స్‌లో సుదీర్ఘ పోస్ట్ పెట్టిన ఆయన తమ ఐదేళ్ల పాలనలో సాధించిన ఘనతలు వివరిస్తూనే.. ఇకపై ప్రతిపక్షంగా క్రియాశీలక పాత్ర పోషిస్తామని రాష్ట్ర ప్రజలకు వెల్లడించారు.'ప్రజల తీర్పును డీఎంకే గౌరవిస్తోంది. ఎన్నికల్లో విజేతలకు అభినందనలు. గత ఐదేళ్లలో తమిళనాడులో ఎన్నో ప్రాజెక్టులు చెపట్టాం. ప్రజలకు మంచి పాలన అందించాం. ప్రతి రంగంలో రాష్ట్రాన్ని అభివృద్ధిపథాన నడిపాం. మా పార్టీ సాధించిన విజయాలను చూసి ఓటెయ్యాలని ఎన్నికల ప్రచారంలో అభ్యర్థించాం. ప్రజల కోసం చేపట్టిన సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు కొనసాగించాలనే ఉద్దేశంతోనే మేము డీఎంకేకు మరోమారు ఓటెయ్యాలని కోరాం.ద్రవిడ మున్నేట్ర కజగం సారథ్యంలోని లౌకిక, అభ్యుదయ కూటమికి ఓటేసిన తమిళ ప్రజలకు నేను హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. డీఎంకే పార్టీకి ఓటు వేసిన వారి కోసమే కాకుండా ఓటేయ్యని వారి కోసం కూడా మేము పనిచేశాం. రాష్ట్ర ప్రజానీకం పట్ల నేను నిజాయతీగా ఉన్నాను. నా ఆలోచనలకు తగ్గట్టుగా విధులు నిర్వర్తించాను. నా శక్తి కొద్దీ శ్రమించాను. నా ప్రియమైన కరుణానిధి కామ్రేడ్.. నా లెక్కనే ఆయన నిజాయతీగా సేవలందించారు. ఆయనను నా నుంచి వేరు చేయలేరు. ఆయనకు మనసారా కృతజ్ఞతలు తెలియజేస్తున్నా.

## బెంగాల్‌లో బీజేపీ విజయం చారిత్రాత్మకం..

- 2026 ఎప్పటికీ గుర్తుండిపోతుంది: ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ, 4 మే (మహాప్రభ)**

పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ విజయం సాధించడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ విజయం చారిత్రాత్మకమని మోదీ అన్నారు. ఎన్నికల్లో గెలిచిన ఈ రోజు చరిత్రలో నిలిచిపోతుందని వ్యాఖ్యానించారు. ఐదు అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల్లో బీజేపీ మూడింట విజయం సాధించింది. అసోం, పుదుచ్చేరిలో బీజేపీ కూటమి గెలిచింది. వీటితోపాటు పశ్చిమ బెంగాల్‌లో గెలవడం బీజేపీకి భారీ ప్రోత్సాహాన్నిచ్చింది. ఈ విజయంపై మోదీ స్పందించారు. పశ్చిమ బెంగాల్‌లో కమలం వికసించిందని సోషల్ మీడియా వేదికగా స్పందించారు. 2026 ఎన్నికలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని, అసోం ప్రజలు మరోసారి ఎన్డీయేను ఆశీర్వదించారని మోదీ అన్నారు. తమిళనాడులో టీవీకే అద్భుత విజయం సాధించిందని ప్రశంసించారు. తమిళనాడు ప్రజల సంక్షేమం, ప్రగతికి కేంద్రం సాయం అందిస్తుందని మోదీ తెలిపారు. బెంగాల్‌లో సాధించిన విజయం.. ఎన్నో ఏళ్లుగా కార్యకర్తలు సాగించిన పోరాటానికి ఫలితం అన్నారు. కార్యకర్తలు లేకుంటే విజయం సాధ్యమయ్యేది కాదని చెప్పారు. బెంగాల్ ప్రజల కోసం, వారి ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చడం కోసం బీజేపీ అన్నివిధాలుగా తోడ్పాటునందిస్తుందని పేర్కొన్నారు. బెంగాల్ ప్రజలు అద్భుత తీర్పు ఇచ్చారని, వారికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని ప్రశంసించారు. బెంగాల్‌లో ప్రజాశక్తి నిలబడిందని, బీజేపీ రాజకీయాలు మంచి పాలనకు నాంది అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తామని తెలిపారు. అసోంలో బీజేపీ కూటమి సాధించిన విజయం.. అక్కడి ప్రజల అభివృద్ధికి, జీవితాల్లో మార్పు కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు నిదర్శనమని వివరించారు. కేరళలో విజయం సాధించిన యూడీఎఫ్ కూటమికి కూడా ప్రధాని అభినందనలు తెలిపారు. వికసిత్ కేరళ కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. పుదుచ్చేరిలో కూడా ఎన్.రంగస్వామి ఆధ్వర్యంలోని బీజేపీ కూటమి విజయం సాధించడంపై కూడా మోదీ హర్షం వ్యక్తం చేశారు. తమ పనితీరు ఆధారంగా ప్రజలు మరోసారి అధికారాన్ని అందించారని పేర్కొన్నారు.

## ఎన్టీఆర్ బాటలో విజయ్!.. పార్టీ స్థాపించిన రెండేండ్లకే అధికారం

### ఎన్టీఆర్ తర్వాత రెండో వ్యక్తిగా రికార్డు



**చెన్నై,4 మే (మహాప్రభ)**

తమిళనాడులో అధికార పీఠం ఎక్కడానికి కొన్ని అడుగుల దూరంలో మాత్రమే ఉన్న విజయ్‌కు చెందిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ రాజకీయంగా మరో చరిత్ర సృష్టించడానికి సిద్ధంగా ఉంది. పార్టీ స్థాపించిన రెండేండ్లకే ఏ పార్టీ అయినా అధికారం దక్కించుకోవడం అంత సులభం కాదు. దీంతో చరిత్రలో ఆ ఫీట్ సాధించిన రెండో వ్యక్తిగా విజయ్ నిలవనున్నారు. తమిళనాడులో విజయ్ విజయం చూస్తుంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దిగ్గజ నటుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ తప్పక గుర్తుకు వస్తారు.ఆయన కూడా తెలుగుదేశం పార్టీని స్థాపించి కేవలం తొమ్మిది నెలల కాలంలోనే రాష్ట్రంలో సుడిగాలి పర్యటన చేసి, అప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించి ఏపీలో అధికారంలోకి వచ్చారు. వీరిద్దరికీ కూడా పలు పోలికలు ఉన్నాయి. ఇద్దరూ సినీ రంగానికి చెందిన వారే. ఇద్దరూ కూడా పార్టీ స్థాపించిన కొద్ది కాలానికే అధికారానికి చేరువయ్యారు. తమిళనాడులో తొలుత దివంగత ముఖ్యమంత్రి, నటుడు ఎంజీ రామచంద్రన్ వీరిద్దరికీ రాజకీయాల్లో ఆదర్శంగా పేర్కొనవచ్చు.

# వాంఖడేలో ముంబై సునామీ బ్యాటింగ్.



మొదటి తరువాయి

ఈ ఇద్దరే 10.5 ఓవర్లలో 145 పరుగులు నమోదు చేసి ముంబై విజయాన్ని ఖరారు చేశారు.ముంబై ఓపెనర్లు రోహిత్ శర్మ, ర్యాన్ రికెల్టన్ ఆరంభం నుంచే దూకుడు ఆడటం మొదలుపెట్టారు. పవర్ ప్లేలో 71 పరుగులు నమోదు చేసిన ఓపెనర్లు.. ఆ తర్వాత విధ్వంసం సృష్టించారు. ర్యాన్ రికెల్టన్ 32 బంతుల్లో ఆరు ఫోర్లు, ఎనిమిది సిక్సర్లతో ఏకంగా 83 పరుగులు చేశాడు. ఒకానొక దశలో సెంచరీ చేస్తాడని అందరూ అనుకున్నారు. కానీ మొహ్సిన్ ఖాన్ బౌలింగ్‌లో షాట్‌కి ప్రయత్నించి దొరికిపోయాడు.ర్యాన్ రికెల్టన్ 22 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేయగా.. రోహిత్ శర్మ 27 బంతుల్లో ఫిఫ్టీ చేశాడు. చాలా మ్యాచ్‌ల తర్వాత మళ్లీ జట్టులోకి వచ్చిన రోహిత్ శర్మ 44 బంతుల్లో 84 పరుగులు చేసి అవుటయ్యాడు. రోహిత్ ఇన్నింగ్స్‌లో ఆరు ఫోర్లు, ఏడు సిక్సర్లు ఉండగా.. ర్యాన్ రికెల్టన్ ఇన్నింగ్స్‌లో ఆరు ఫోర్లు, మూడు 8 సిక్సర్లు ఉన్నాయి. రోహిత్ అవుటయ్యే సమయానికి ముంబై 14 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 177 పరుగులు చేసింది.ఓపెనర్లు ఇద్దరూ అవుటైన తర్వాత ఆ ఫామ్‌ను నమన్ ధీర్ కొనసాగించాడు. తిలక్ వర్మ ఫస్ట్ డౌన్‌లో వచ్చినా పెద్దగా రాణించలేకపోయాడు. 13 బంతులు ఆడిన తిలక్ కేవలం 11 పరుగులు మాత్రమే చేసి అవుటయ్యాడు. సెకండ్ డౌన్‌లో బ్యాటింగ్‌కి వచ్చిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కూడా పెద్దగా రాణించలేకపోయాడు. 7 బంతుల్లో రెండు ఫోర్లతో 12 పరుగులు చేసి అవుటయ్యాడు. వికెట్లు పడుతున్నా నమన్ ధీర్ 12 బంతుల్లో 23 పరుగులు చేసి మ్యాచ్ విజయంలో తన వంతు పాత్ర కూడా పోషించాడు. విల్ జాక్స్ విన్నింగ్ షాట్ బాదడంతో ముంబై ఇండియన్స్ 18.4 ఓవర్లలోనే 229 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి విజయం సాధించింది.

# 'దేశమంతా మోడీ మయం'

మొదటి తరువాయి

ఈ విస్తరణ కేవలం భౌగోళిక చిత్రపటంలో వ్యాప్తి మాత్రమే కాదు. ఇది ప్రగతి పథంలో పయనించాలని దృఢంగా సంకల్పించిన ప్రజల విశ్వాసానికి ప్రతీక. ఉత్తరాది నుంచి ఈశాన్యం వరకు మార్పు కొనసాగుతోంది. ఇప్పటికీ వేగంగా సాగుతున్న ఒక బృహత్తర గాథలో బెంగాల్ కేవలం ఒక సరికొత్త అధ్యాయం మాత్రమే. మనమందరం కలిసి 2047లోగా వికసిత్ భారత్‌ను నిర్మిద్దాం' అని బీజేపీ పోస్ట్‌లో రాసుకొచ్చింది.

21కి చేరిన ఎన్డీయే పాలిత రాష్ట్రాలు

బెంగాల్‌లో విజయం సాధించడం వల్ల దేశంలో ఎన్డీయే పాలనలో ఉన్న రాష్ట్రాల సంఖ్య 21కి పెరగనుంది. బెంగాల్ విజయం ద్వారా బీజేపీ స్వతంత్రంగా పాలించే రాష్ట్రాలు 15కు చేరనున్నాయి. అదనంగా బిహార్‌లో జేడీయూ, ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, నాగాలాండ్‌లో నాగా పీపుల్స్ ఫ్రంట్, మేఘాలయలో నేషనల్ పీపుల్స్ పార్టీతో కూటమి వల్ల మొత్తం సంఖ్య 21కి చేరుతోంది. ప్రస్తుతం దేశంలో 29 రాష్ట్రాలు ఉండగా, మెజారిటీ మార్క్ 14.5. ఈ విధంగా చూస్తే కేరళ, కర్ణాటక, ఝార్ఖండ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్, మిజోరం మినహా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎన్డీయే కొనసాగుతోంది.

ఆరు రాష్ట్రాలకే పరిమితమైన ఇండియా కూటమి

కేంద్రంలో ప్రధాన ప్రతిపక్ష కూటమిగా ఉన్న ఇండియా కూటమి ప్రస్తుతం ఆరు రాష్ట్రాల్లో మాత్రమే ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. తమిళనాడులో ఓటమి ఎదురైనా, కేరళలో విజయంతో కొంత ఊరట లభించింది. అయినప్పటికీ ఈ ఫలితాలు కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి భవిష్యత్తుపై అనిశ్చితిని సృష్టించాయి. ఎన్నికల సంఘం ఫలితాల ప్రకారం కాంగ్రెస్ పార్టీ కేవలం కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లోనే స్వతంత్ర మెజారిటీ ప్రభుత్వాలను కలిగి ఉంది. ఝార్ఖండ్‌లో జేఎంఎంతో కూటమిలో ఉంది. పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్?) అధికారంలో ఉన్నప్పటికీ అది ఇండియా కూటమిలో భాగం కాదు. ఇప్పుడు తమిళనాడులో డీఎంకే–కాంగ్రెస్ కూటమి పరాజయం పాలైంది. నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళ వెట్రి కజగం (టీవీకే) పార్టీ భారీ ఆధిక్యంతో ముందంజలో ఉంది. 234 స్థానాల్లో 110 స్థానాల్లో టీవీకే ఆధిక్యంలో ఉంది. అటు అసోంలోనూ కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తగిలింది.

# అస్సాంలో బీజేపీ హ్యాట్రిక్..

-చిత్తుగా ఓడిన కాంగ్రెస్

-పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గొగోయ్ కూడా ఓటమిపాలు



**గువాహటి,**

బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అస్సాంలో వరుసగా మూడోసారి అధికారాన్ని దక్కించుకుంది. హిమంత బిశ్వశర్మ పాలనకు అనుకూలంగా ప్రజలు తీర్పు చెప్పారు. 126 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 102 సీట్లతో ఎన్డీఏ కూటమి విజయాన్ని సాధించింది. ఇక్కడ బీజేపీ 81 సీట్లతో ఏకైక అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించగా, దాని మిత్రపక్షాలైన బోడో పీపుల్స్ ఫ్రంట్, అస్సాం గణపరిషత్ చెరో 10 సీట్లను దక్కించుకున్నాయి. అస్సాం సీఎం బిశ్వ శర్మ జలుకబరిలో విజయం సాధించారు. మరోవైపు కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష కూటమి అధికార పార్టీ జోరుకు ఏమాత్రం అడ్డుకట్ట వేయలేక పోయింది.కాంగ్రెస్ 21, ఏఐయూడీఎఫ్ 2, ఇతరులు ఒక స్థానాన్ని దక్కించుకున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్ కూడా పరాజయం పాలయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఓటమికి బాధ్యత వహిస్తూ కాంగ్రెస్ అస్సాం పోల్ ఇన్‌చార్జి భన్వర్ జితేంద్ర తన పదవికి రాజీనామా చేశారు. అస్సాంలో 16 సీట్లలో తొలిసారిగా పోటీ చేసిన జార్ఖండ్ ముక్తి మోర్చా తన ఖాతాను తెరవడంలో విఫలమైంది. ఏఐయూడీఎఫ్ చీఫ్ బద్రుద్దీన్ అజ్మల్ బిన్నకండి నియోజకవర్గంలో విజయం సాధించారు.

# విజయ్ విహారం

**న్యూఢిల్లీ:**

నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతానికి గత నెలలో జరిగిన ఎన్నికల ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ తమిళనాడులో అతిపెద్ద పార్టీగా అవతరించింది. మొత్తం 234 స్థానాల్లో 107 సీట్లను గెలుచుకొని విజయ ఢంకా మోగించింది. అధికార డీఎంకే కూటమి 74 స్థానాలకు పరిమితమయ్యింది. పోటీచేసిన రెండు స్థానాల్లో విజయ్ విజయం సాధించగా.. కొళత్తూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన తమిళనాడు సీఎం స్టాలిన్ పరాజయం పాలయ్యారు.ఇక, దేశవ్యాప్తంగా ఎంతో ఉత్కంఠకు గురిచేసిన పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ కంచుకోటలో బీజేపీ కూటమి తొలిసారిగా పాగా వేసింది. మొత్తం 294 సీట్లలో 208 స్థానాలను గెలుచుకొని అధికారాన్ని



చేజిక్కించుకొన్నది. భవానీపూర్ నుంచి పోటీ చేసిన మమత.. బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి చేతిలో 15 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. కేరళలో లెఫ్ట్ కూటమికి కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ గండి కొట్టింది. 140 అసెంబ్లీ స్థానాలు ఉన్న కేరళలో.. యూడీఎఫ్ కూటమి 89 స్థానాల్లో గెలుపొందగా, ఎల్డీఎఫ్ కూటమి 35 స్థానాలకే పరిమితమయ్యింది. అస్సాం లో బీజేపీ ఘన విజయం సాధించింది. 126 స్థానాల్లో బీజేపీ కూటమి 102 సీట్లు గెలుపొందగా, కాంగ్రెస్ కూటమి 21 స్థానాలకు పరిమితమయ్యింది. కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో ఎన్నార్ కాంగ్రెస్ కూటమి మ్యాజిక్ మార్కును దాటింది.

# కేరళలో ఫలించిన సీఎం రేవంత్ వ్యూహాలు

మొదటి తరువాయి

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన నాటి నుండి రేవంత్ రెడ్డి నిరంతరం తన ధాతువును చూపిస్తుండగా తాజాగా కేరళ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సరళి ఆయనను జాతీయ కాంగ్రెస్‌తో పోల్చినా అధిష్ఠానం పెద్దల మన్ననలు పొందుతున్నారనే టాక్ వినిపిస్తోంది. తనదైన దూకుడుతో సొంత రాష్ట్రంలో దివంగత సీఎం వైఎస్సార్‌ను తలపిస్తున్నారని జాతీయ స్థాయిలో అధిష్ఠానానికి మంచి ఆప్తునిగా మారుతున్నారనే చర్చ గుప్పుమంటోంది.

తెలంగాణలో జోరు: పీసీసీ హోదాలో ఉంటూ 2023లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన నాటి నుండి ముఖ్యమంత్రి అయ్యాక వరుస విజయాలతో రేవంత్ రెడ్డి గ్రాఫ్ నిరంతరం పెరుగుతూనే ఉంది. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కు గుండు సున్నా తెప్పిస్తానని చెప్పి మరీ ఆ పార్టీని జీరో సీట్లకు పరిమితం చేయడంతో పాటు రాష్ట్రంలో జరిగిన కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాలను కాంగ్రెస్ ఖాతాలో వేయించగలిగారు. ఇక ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని ప్రత్యర్థులు ఎన్ని ఆరోపణలు చేసినా లోకల్ బాడీ ఎన్నికల్లో అధికార పార్టీదే పై చేయిగా నిలపడంలో రేవంత్ రెడ్డి వ్యూహాలు ఫలించాయి. ఈ పరిణామాలతో కాంగ్రెస్ అధిష్ఠానం రేవంత్ రెడ్డి ఆలోచనలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఇటీవల పరిణామాలు తేటతెల్లం చేస్తున్నాయి.

జాతీయ స్థాయిలో స్పీడ్: గత నెలలో లోక్ సభలో కేంద్రం ప్రవేశపెట్టిన డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల అంశానికి సంబంధించిన బిల్లుపై రేవంత్ రెడ్డి తన మార్క్ చూపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ముసుగులో డీలిమిటేషన్ కార్యక్రమానికి మోదీ సర్కార్ శ్రీకారం చుడుతోందంటూ రేవంత్ రెడ్డి అగ్గిరాజేశారు. ఆ బిల్లును అడ్డుకుని చూపిస్తామని సవాల్ విసిరారు. అందుకు తగ్గట్టుగానే ఈ విషయంలో దేశంలో మిగతా ముఖ్యమంత్రులందరికంటే రేవంత్ రెడ్డినే పెద్ద ఎత్తున చర్చ జరిగేలా వ్యూహం రచించారు. ఈ క్రమంలో రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన హైబ్రిడ్ మోడల్ ఏకంగా పార్లమెంట్లోనే ప్రస్తావనకు వచ్చిందంటే ఆయన వ్యూహం ఏ మేరకు ఫలించిందో అర్థం చేసుకోవచ్చని రేవంత్ అభిమానులు, కాంగ్రెస్ శ్రేణులు చెబుతున్నారు. రేవంత్ రెడ్డి చెప్పినట్లుగానే మహిళా బిల్లుకు సంబంధించిన 131 రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. దాంతో రేవంత్ రెడ్డి పేరు జాతీయ స్థాయిలో మారుమోగింది.

దూకుడు వైఖరే బలం:

తాజాగా కేరళ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సరళి రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో జాతీయ స్థాయి వ్యూహకర్తగా నిలబెట్టేలా చేసిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అప్పటి వరకు బీజేపీ వర్సెస్ ఎల్డీఎఫ్ కూటమి మధ్య సాగుతున్న ప్రచార పర్వాన్ని ఎవరూ ఊహించని రీతిలో పినరయి విజయన్ పై మాటల యుద్ధానికి తెర లేపి గేమ్ ను పూర్తిగా ఎల్డీఎఫ్ వర్సెస్ యూడీఎఫ్ గా మార్చివేశారు. ఏదైనా రాష్ట్రంలో మేనిఫెస్టో ప్రకటించాలంటే అది అధిష్ఠానం పెద్దల సమక్షంలో జరుగుతుంది. కానీ ఏఐసీసీ కేరళలో మాత్రం ఆ అవకాశం రేవంత్ రెడ్డికి అప్పగించింది. అంటే రేవంత్ రెడ్డిని పార్టీ పెద్దలు మరింత విశ్వసిస్తున్నారని ఆ విశ్వాసం నిలబెట్టుకునేలా రేవంత్ రెడ్డి వ్యూహరచన చేసి కేరళలో కాంగ్రెస్ కూటమిని అధికారం దిశగా నడిపించడంలో కీలక పాత్ర పోషించారనే చర్చ జరుగుతోంది. తనకున్న దూకుడు తత్వం రేవంత్ రెడ్డి ప్రచార శైలి, ప్రత్యర్థులపై ఆయన చేసే విమర్శలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారాయి. పినరయి విజయన్ వంటి సీనియర్ నాయకులను సైతం ధీటుగా ఎదుర్కోవడం వల్ల ఆయన కేరళలో కీ రోల్ గా మారడంతో కాంగ్రెస్‌లో రేవంత్ రెడ్డి గ్రాఫ్ మరింత పెరిగిందని ఆయన ఆలోచనలకు మరింత మద్దతు అధిష్ఠానం పెద్దల వద్ద దక్కే అవకాశం ఉండబోతున్నట్లు తెలుస్తోంది.

# త్వరలో మంత్రివర్గ విస్తరణ?

మొదటి తరువాయి

వీరి స్థానంలో ఎవరికి ఛాన్స్ ఉంటుందనేది త్వరలో తెలుస్తుంది. కానీ ఖాళీగా ఉన్న రెండింటికీ మాత్రం ఒక బీసీ, ఒక ఎస్టీ (లంబాడా)కి ఇవ్వాలని దాదాపుగా ఖరారైనట్లు తెలిసింది. జిల్లాల సమీకరణాన్ని పరిగణనలోకి తీసుకుని ఆశావాహుల్లో ఎవరికి ఇవ్వాలన్నది ఫైనల్ కానుంది. ఎలాగూ సెకండ్ వీక్ తర్వాతనే మంత్రివర్గంలో మార్పులు ఉంటాయనే వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ లోపే ఒకసారి సీఎం, పీసీసీ చీఫ్ ఢిల్లీ పర్యటన ఉండే అవకాశముంది. ఖాళీగా ఉన్న రెండు బెర్తుల్లో ఒకదాన్ని తప్పకుండా లంబాడా కమ్యూనిటీకి ఇవ్వాలనే సూత్రప్రాయ నిర్ణయం జరిగిందని పార్టీ వర్గాల సమాచారం. బాలు నాయక్, రామచంద్రునాయక్ లలో ఒకరికి అవకాశం దక్కనుంది. రామచంద్రు నాయక్ పేరును డిప్యూటీ స్పీకర్‌గా ఇప్పటికే సీఎం ప్రకటించారు. కానీ ఆయన ఇంకా బాధ్యతలు చేపట్టలేదు. ఆయనను మంత్రివర్గంలోకి తీసుకుని బాలు నాయక్‌ను డిప్యూటీ స్పీకర్ చేయడంపైనా పార్టీలో చర్చ జరుగుతున్నది. కానీ రామచంద్రు నాయక్ పేరును ప్రకటించిన తర్వాత ఆ బాధ్యతలు చేపట్టడానికి బాలు నాయక్ సుముఖంగా లేరనే వార్తలు పార్టీ వర్గాల నుంచే వినిపించాయి. మంత్రి పదవిని ఆశించాలని, అది దక్కకపోతే సైలెంట్‌గా ఉండటానికి కూడా సిద్ధపడ్డారని, కానీ ఇప్పటికే డిప్యూటీ స్పీకర్ పోస్టుకు పేరును ప్రకటించిన తర్వాత ఆ స్థానంలోకి వెళ్ళడానికి మాత్రం ఆసక్తిగా లేరని తెలిసింది. రాష్ట్ర మంత్రివర్గంలో ప్రస్తుతం నలుగురు రెడ్డి, నలుగురు ఎస్సీ, ముగ్గురు బీసీ, ముగ్గురు అగ్రవర్ణాలు, ఒక మైనార్టీ ఒక ఎస్టీకి చెందినవారు ఉన్నారు. దీంతో ఒక బీసీ, ఒక లంబాడా ఇస్తే సోషల్ జస్టిస్ ఈక్వేషన్ సెట్ అవుతుందన్నది ఏఐసీసీ భావన. రాష్ట్రంలో బీసీ జనాభా 56% ఉన్నందున ఆ కమ్యూనిటీకే ఇవ్వడమే సహేతుకం అనేది పార్టీ ఆలోచన. బీసీల్లో ముదిరాజ్, గౌడ్, పద్మశాలికి అవకాశం దక్కినందున మరో బీసీ మంత్రిని ఏ సామాజికవర్గం నుంచి ఎంపిక చేయాలన్నది కీలకం. మున్నూరు కాపు సామాజికవర్గానికి ఇటీవలే మంత్రి హోదాతో కూడిన సలహాదారు పోస్టు ఇవ్వడంతో మంత్రి పదవికి కూడా అదే సామాజికవర్గానికి అవకాశం దక్కుతుందా అనేది ఆసక్తికరంగా మారింది. ఢిల్లీ టూర్ తర్వాత దీనిపై కొంత క్లారిటీ రానున్నది.

## అసాధ్యమైన యుద్ధమా?
# ఒప్పందమా?

మొదటి తరువాయి



దీన్ని అర్థం చేసుకోవడానికి ఒకే ఒక మార్గం ఉంది: ట్రంప్ ఒక అసాధ్యమైన సైనిక చర్య లేదా ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో ఒక చెడ్డ ఒప్పందం మధ్య ఎంచుకోవాలి. అమెరికాకు నిర్ణయం తీసుకునే అవకాశాలు తగ్గిపోయాయి అని పేర్కొన్నది. అంతేగాక, ఇరాన్ ఓడరేవులపై అమెరికా విధించిన నావికా దిగ్బంధాన్ని ముగించడానికి ఇరాన్ ఒక గడువు విధించిందని తెలిపింది. అయితే అందుకు కచ్చితమైన కాలపరిమితిని ఐఆర్‌జీసీ పేర్కొనలేదు. అమెరికా పట్ల చైనా, రష్యా, యూరప్ వైఖరిలో మార్పు వస్తున్నదని, ఇది పెరుగుతున్న అంతర్జాతీయ ఒత్తిడిని సూచిస్తున్నదని కూడా ఐఆర్‌జీసీ తెలిపింది.

దిగ్బంధాన్ని ఎత్తేయాలి..

యుద్ధాన్ని ముగించేందుకు 14 పాయింట్లతో ఇరాన్ కొత్త ప్రతిపాదన తెరపైకి తెచ్చింది. పాకిస్థాన్ ద్వారా దీన్ని అమెరికాకు అందజేసింది. లెబనాన్‌సహా అన్ని విధాలుగా యుద్ధాన్ని ముగించాలని కోరింది. అమెరికా ప్రతిపాదించిన కాల్పుల విరమణ పొడిగింపును తిరస్కరించింది. 30 రోజుల్లోగా యుద్ధాన్ని శాశ్వతంగా ముగించేలా పరిష్కారాన్ని కోరింది. తమపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని, తమపై మళ్లీ దాడి చేయకుండా భద్రతా హామీలు ఇవ్వాలని, హొర్ముజ్ దిగ్బంధాన్ని ఎత్తివేయాలని, స్తంభింపజేసిన తమ ఆస్తులను విడుదల చేయాలని, యుద్ధం కారణంగా జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని ఆ ప్రతిపాదనల్లో కోరింది.

## రాష్ట్రంలో క్షీణించిన
# శాంతిభద్రతలు

మొదటి తరువాయి

మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. "ప్రభుత్వం, పోలీసులు ప్రతిపక్ష నేతలపై కేసులు పెట్టడం, సోషల్ మీడియా పోస్టులకు వేధించడంపై చూపే శ్రద్ధ.. ప్రజల భద్రతపై చూపడం లేదు. కరీంనగర్‌లో పట్టపగలు తుపాకులతో వచ్చి దోపిడీ చేయడం అత్యంత దుర్మార్గం. ఘటన జరిగి 32 గంటలైనా నిందితులను పట్టుకోకపోవడం పోలీసు వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనం' అని విమర్శించారు. కేసీఆర్ హయాంలో కరీంనగర్‌ను సేఫ్ సిటీగా మార్చేందుకు 769 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించామని, గంగుల కమలాకర్ చొరవతో వేల సంఖ్యలో కెమెరాలు ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. నేడు నేరగాళ్లకు పోలీసులంటే భయం లేకుండా పోయిందని, దుండగులు పారిపోయింది పోలీసుల భయంతో కాదనీ.. షాపు సిబ్బంది చనిపోయారని భావించి మాత్రమే' అని అన్నారు.

బండి సంజయ్ వైఖరిపై ప్రశ్నలు

'నగల దుకాణంలో నలుగురు సిబ్బందికి తుపాకీ గాయాలైతే, జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల్లో ఒక్కరికైనా బాధితులను చూసే సమయం లేదా? కేంద్ర మంత్రి బండి సంజరుకి శవాల మీద రాజకీయాలు తప్ప ఏమీ తెలియదు. రాష్ట్రంలో దోపిడీ జరిగితే హోంశాఖను, రేవంత్‌రెడ్డిని నిలదీయాల్సింది పోయి బీఆర్ఎస్‌పై పడతారేంటి? రేవంత్‌రెడ్డిపై సంజరుకి అంత ప్రేమ ఎందుకు?' అని కేటీఆర్ ప్రశ్నించారు. పోలీసులు 20 ఏండ్ల నాటి కేసులను తవ్వి తీసి బీఆర్ఎస్ కార్పొరేటర్లను ఇబ్బంది పెడుతున్నారన్నారు. అధికారం శాశ్వతం కాదని, అతిగా వ్యవహరిస్తున్న అధికారులపై తాము అధికారంలోకి వచ్చాక చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ప్రాణాలు కాపాడలేని పోలీస్ వ్యవస్థ ఎందుకు? అంటూ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కూర్చోవడం కాదని, శాంతి భద్రతలను కమాండ్ చేయడం నేర్చుకోవాలని సూచించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి, దోపిడీ దొంగలను వెంటనే పట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకే రవిశంకర్ తదితరులు ఉన్నారు.

# సంపాదకీయం

## బిజెపికి మరింత శక్తి !



బెంగాల్,తమిళనాడు, కేరళం ప్రజలు మార్పు కోరుకున్నారు. ఈ మార్పు ఎక్కువగా బిజెపికే లాభించింది. ముఖ్యంగా బెంగాల్, తమిళనాట పాలకుల అహంకారంపై ప్రజలు అంకుశం దింపారు. కేవలం కుటుంబ పాలనతో ప్రజలను విస్మరించిన మమత, స్టాలిన్‌లకు ప్రజలు గట్టి బుద్ధి చెప్పారు. బిజెపికి కొత్త శక్తిని ఇచ్చారు. దేశమంతా ఎన్నికల ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురుచూసినా..అందరి దృష్టి కేవలం బెంగాల్‌పైనే ఉంది. బెంగాల్లో మమతా బెనర్జీని బిజెపి మట్టికరిపిస్తుందా లేదా అని ఎదురు చూశారు. అనుకున్నట్లుగానే, మోడీ, అమిత్ షా ద్వయం బెంగాల్లో కూడా పాగా వేశారు. అస్సాంలో పట్టు నిల్పుకున్నారు. కలకత్తా కాళీ కరుణించింది. బిజెపికి పగ్గాలు అప్పగించిది. ఇక డబుల్ ఇంజిన్ సర్కార్ అక్కడా మార్పు కోసం యత్నించ నుంది. దేశంలో నాలుగు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతానికి జరిగిన ఎన్నికల ఫలితాలు మార్పును సూచించాయి. ఎగ్జిట్ పోల్స్‌కు భిన్నంగా ఫలితాలు వచ్చాయి. బిజెపి, కాంగ్రెస్ ఖాతాలో మరో రాష్ట్రం పడగా, తమిళనాడులో టివికె పార్టీ తొలి ప్రయత్నంలోనే అధికారం దక్కించుకోబోతోంది. ఇక్కడ డిఎంకె మళ్లీ విజయం సాధిస్తుందన్న అంచనాలు తలకిందులయ్యాయి. కేరళంలో దశాబ్దం తరవాత కాంగ్రెస్ కూటమి అధికారం లోకి రాబోతోంది. ఇక అసోం, పాండిచ్చేరిలో బిజెపి అధికారం నిలుపుకుంది. మొత్తంగా బెంగాల్లో మమత, తమిళనాట స్టాలిన్‌ల అహంకారంపై ప్రజలు అంకుశం దింపారు. ఇది వారి స్వయంకృత ఓటమిగానే చూడాలి. కాంగ్రెస్‌కు సంబంధించినంత వరకు కేరళం విజయం ఆ పార్టీకి ఊరటనిచ్చే అంశం. తమిళనాట పార్టీ పెట్టిన రెండేళ్లలోనే అధికారం చేపట్టబోతున్న విజయ్ ఓ రకంగా చరిత్ర సృష్టించారనే చెప్పాలి. నిరంకుశంగా పాలించడంతో పాటు కేవలం దక్షిణాది, హిందీ వ్యతిరకత ప్రదర్శించిన డిఎంకెకు ప్రజలు గుపాఠం చెప్పారు. బెంగాల్లో మమతా బెనర్జీ ఏకపక్ష రాక్షస పాలనకు ప్రజలు చరమగీతం పాడారు. బంగ్లాదేశ్‌కు సరిహద్దు రాష్ట్రంగా ఉన్న బెంగాల్లో అవినీతి, అధికార దురహంకారం పెచ్చుమీరాయి. 15 ఏళ్లపాటు రాజ్యమేలిన బెంగాల్లో మమతా బెనర్జీ రాష్ట్రాన్ని మాఫియా కోటగా తయారు చేసుకున్నారు. ప్రజలకు మాట్లాడే స్వేచ్ఛ లేదు. ఓట్ల కోసం అక్ర చొరబాటుదారులను చేరదీశారు. వారికి ఆధార్ కార్డులు, ఓటరు కార్డులు మంజూరయ్యాయి. బంగ్లా వసలదారుల పెత్తనంలో సొంత రాష్ట్రం ప్రజలు నలిగి పోయారు. పరాయి ప్రజలుగా మారారు. అత్యాచారాలు, హత్యలు, దోపిడీలు నిత్యకృత్యం అయ్యాయి. ఇవన్నీ ఎదరించిన వారిని మట్టు పెట్టారు. దాడులు, విధ్వంస రచన సాగింది. అందుకే వీటిలో పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాలపైనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది. వరుసగా నాలుగోసారి మమతా బెనర్జీ అధికారాన్ని అందుకుంటారా? లేకుంటే మమత పాలనకు బీజేపీ చరమ గీతం పాడనుందా? అంటూ ఈ రాష్ట్ర ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. దాదాపు 50 ఏళ్ల పాటు.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రాన్ని రెండు పార్టీలే పాలించాయి. 34 సంవత్సరాలు జ్యోతిబసు నేతృత్వంలోని లెఫ్ట్ ఫ్రంట్, ఆ తర్వాత తృణమూల్ కాంగ్రెస్ పార్టీలు రాష్ట్రాన్ని ఏలాయి. కానీ ఈ సారి పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ పాగా వేయడంతో అక్కడ కొత్త చరిత్ర లిఖితం కాబోతోంది. 2021లో జరిగిన ఎన్నికల్లో ఈ రెండు పార్టీల మధ్య తీవ్ర పోరు నడించింది. ఆ సమయంలో బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి చేతిలో మమతా బెనర్జీ ఓటమి పాలైన సంగతి తెలిసిందే. దాదాపుగా ఐదేళ్లుగా అక్కడ బిజెపి వివిధ సమస్యలపై పోరాడుతూ వచ్చింది. అందుకు ఫలితం దక్కింది. బెంగాల్లో బిజెపి కాషాయ జెండా ఎగరేయడం ఓ చరిత్రగా చూడాలి. ఇకపోతే ఈ విజయం ఓ రకంగా మోడీ, అమిత్ షాల పట్టుదల, వ్యూహాత్మక రాజకీయాలకు నిదర్శనంగా చూడాలి. రాష్ట్రంలో గత మూడు ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించిన టీఎంసీ నాలుగోసారి విజయంపై ధీమాగా ఉన్నప్పటికీ ప్రజలు ఛీకొట్టారు. మరోవైపు బెంగాల్‌లో పాగా వేయాలని శక్తియుక్తులన్నీ ధారపోసిన బీజేపీ కూడా తనదే విజయం అనిచాటుకుంది. ప్రధాని మోడీ, అమిత్ షాలు ఇక విజయోత్సవాల్లో పాల్గొనడానికి వస్తామని చెప్పారు. ఎగ్జిట్‌పోల్స్‌లో ఎక్కువశాతం మాత్రం బీజేపీకే అనుకూలంగా వచ్చాయి. అయితే, తాము 200 పైచిలుకు స్థానాల్లో గెలవబోతున్నామని సీఎం మమత ప్రకటించారు. కానీ ఓటర్లు బిజెపికే పట్టం కట్టారు. ఇక కేరళ విషయానికి వస్తే ఎన్నికల అయిపోగానే ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ తన పేరు వెనుక సీఎం అనే పదాన్ని తొలగించు కున్నారు.. వృద్దాప్యంతో పాటు పలు అవినీతి, కుంభకోణాల కారణంగా అనేక విమర్శలు ఎదుర్కొన్నారు. కేరళలో ఎల్‌డిఎఫ్ లేదా యూడిఎఫ్ అధికారం చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. గత పదేళ్లుగా సినరయ్ విజయ్ పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. ప్రజలు మార్పు కోరుకోవడంతో యూడిఎఫ్‌కు మళ్లీ అధికారం దక్కడం ఖాయమయ్యింది. ఇక తమిళనాడు లో ఓట్ల లెక్కింపునకు ఒకరోజు ముందే రిసార్టు రాజకీయాలు మొదలయ్యాయి. ఈసారి రాష్ట్రంలో హంగ్ వస్తుందని.. తానే కింగ్ మేకర్ అవుతానన్న ధీమాతో ఉన్న టీవీకే అధ్యక్షుడు దళపతి విజయ్, తన ఎమ్మెల్యేలందరిని రిసార్టుకు తరలించే ఏర్పాట్లు చేసుకున్నారు. అనూహ్యంగా ఆయనే కింగ్ అయ్యారు. అయితే పూర్తి మెజార్టీకి దూరంలో ఉన్నారు. దీంతో ఇతర పార్టీలతో జట్టుకట్టక తప్పనిపరిస్థితి ఏర్పడింది. ఈక్రమంలో అన్న డిఎంకె కూడా రెండోస్థానంతో సత్తా చాటింది. ఎప్పుడూ ద్విముఖ పోరు జరిగే తమిళనాడులో ఈసారి త్రిముఖ పోరు సాగింది. దశాబ్దాలుగా రాష్ట్ర రాజకీయాలను డీఎంకే లేదా అన్నాడీఎంకే పార్టీలే శాసిస్తుండగా.. వీటి మధ్యలోకి ఈసారి'తమిళ వెట్రి కళగం' (టీవీకే) పార్టీతో సినీనటుడు విజయ్ ప్రవేశించారు. సీఎం స్టాలిన్ నేతృత్వంలోని అధికార డీఎంకేదే ఈసారి కూడా అధికారమని మె జారిటీ ఎగ్జిట్‌పోల్ సర్వేలు ప్రకటించాయి. 'యాక్సిస్ మై ఇండియా' మాత్రం విజయ్ పార్టీ ఏకంగా 120 వరకు సీట్లు గెలుస్తుందని అంచనా వేసింది. విజయ్ పార్టీ గెలవడంతో ఇప్పుడు తమిళనాడు లో సరికొత్త రాజకీయ శకం మొదలైనట్లే. మొత్తంగా ఫలితాలు బిజెపిలో ఆశావహ దృక్పథాన్ని నిలిపాయి. మహిళా రిజర్వేషన్ బిల్లు కూడా కొంత తోడ్పడిందనే చెప్పాలి.

## పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ విజయోత్సవాలు

# ఎల్ బి నగర్ లో ఘనంగా సంబరాలు






**ఎల్‌బి నగర్ 4 మే ( మహాప్రభ)**
పశ్చిమ బెంగాల్లో భారతీయ జనతా పార్టీ సాధించిన విజయాన్ని పురస్కరించుకుని ఎల్ బి నగర్ లోఘనంగా సంబరాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమం మేడ్చల్ జిల్లా ప్రభారి, ఎల్ బి నగర్ అసెంబ్లీ ఇంచార్జ్ సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సంబరాల్లో కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ మరియు ఎల్ బి నగర్ మాజీ కార్పొరేటర్లు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ, పశ్చిమ బెంగాల్లో బీజేపీ సాధించిన విజయం దేశవ్యాప్తంగా పార్టీ శక్తిని మరింత బలపరిచిందని తెలిపారు. ప్రజలు అభివృద్ధి, పారదర్శక పరిపాలన మరియు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంపై విశ్వాసం ఉంచిన ఫలితమే ఈ విజయమని పేర్కొన్నారు. ప్రతి రాష్ట్రంలో బీజేపీకి పెరుగుతున్న ఆదరణ దేశంలో సానుకూల మార్పుకు నిదర్శనమని ఆయన అన్నారు. అలాగే, తెలంగాణలో కూడా పార్టీని బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో కూడా ఇలాంటి విజయాలను సాధించడానికి కృషి చేయాలని కోరారు. ఈ సంబరాల్లో కార్యకర్తలు నినాదాలు చేస్తూ, మిఠాయిలు పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. ఎల్ బి నగర్ బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గడ్డిఅన్నారం డివిజన్ లో భారతీయ జనతా పార్టీ ఘనంగా విజయోత్సవాలు






**గడ్డి అన్నారం 4 మే (మహాప్రభ)**
వెస్ట్ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాలలో జరిగిన ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ సాధించిన విజయాన్ని పురస్కరించుకుని గడ్డి అన్నారం డివిజన్ లో ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డివిజన్ అధ్యక్షుడు దాసరి జయ ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యకర్తలు మిఠాయిలు పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, దేశ ప్రజలు అభివృద్ధి మరియు పారదర్శక పాలనకు మద్దతుగా బీజేపీకి విజయం అందించారని తెలిపారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం వేగంగా అభివృద్ధి దిశగా పయనిస్తోందని, కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రతి కుటుంబానికి చేరుతున్నాయి పేర్కొన్నారు.
అలాగే, ఎన్నికల్లో వ్యూహాత్మకంగా పార్టీని ముందుకు నడిపించిన అమిత్ షా పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. బూత్ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేయడం, కార్యకర్తలతో సమన్వయం సాధించడం ద్వారా ఈ విజయాలు సాధ్యమయ్యాయి అన్నారు. రానున్న తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కూడా ప్రజలు అభివృద్ధి వైపు ఓటు వేస్తారని, బీజేపీకి ఘన విజయం సాధించే అవకాశాలు ఉన్నాయని విశ్వాసం వ్యక్తం చేశారు. స్థానిక స్థాయిలో పారదర్శక పాలన అందించడమే పార్టీ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఆనంద్ కుమార్, శ్రీధర్ రెడ్డి, శ్రవణ్, సిరి రెడ్డి, సందీప్, శివ రామ్, మణి దీప్, మహేందర్ రాజు, సతీష్ చారీ, బాబు చౌదరి, వివేక్, రవి, దినేష్, సిద్ధు, వంశీ యాదవ్, గిరీష్, వంశీ, వినయ్, హరీష్ గౌడ్, టీంకు, రాము తదితరులు పాల్గొన్నారు.

# వరి కొనుగోలు వేగవంతం చేయాలి

-వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు ఆదేశాలు




**కామారెడ్డి మే 4 (మహా ప్రభ)**
రాష్ట్రవ్యాప్తంగా వరి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, రాష్ట్ర సివిల్ సప్లైస్ శాఖ మంత్రి, ఇన్‌చార్జ్ మంత్రులు, ప్రధాన కార్యదర్శి, సివిల్ సప్లైస్ కమిషనర్ జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులకు ఆదేశించారు. సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వారు ఈ మేరకు స్పష్టమైన సూచనలు చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు సజావుగా సాగాలని, ముఖ్యంగా రాబోయే ఐదు రోజుల్లో అకాల వర్షాల సూచనలు ఉన్న నేపథ్యంలో అన్ని జిల్లాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇప్పటికే కొనుగోలు చేసిన వరి వర్షాలకు తడవకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**ముఖ్య సూచనలు ఇవే...**

పీపీసీల నుంచి కొనుగోలు చేసిన వరిని తక్షణమే రైస్ మిల్లులు, గోదాములకు తరలించాలి.

తగినంత తార్పాలిన్‌లు ఏర్పాటు చేసి వరి నిల్వలను కప్పాలి.

డన్నేజ్ ఏర్పాటు చేసి తేమ నేలకు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

కొనుగోలు కేంద్రాల్లో నీటి నిల్వలు లేకుండా డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం చేయాలి.

వర్షాల సమయంలో పీపీసీల వద్ద 24 గంటల పర్యవేక్షణ చేపట్టాలి.

అత్యవసర తరలింపుల కోసం సిబ్బంది, వాహనాలు సిద్ధంగా ఉంచాలి.

రవాణా, మిల్లర్లతో సమన్వయం కొనసాగిస్తూ తరలింపులో అంతరాయం లేకుండా చూడాలి.

రైతులకు అవగాహన కల్పించి వరి గుంపులను కప్పడం, కాలువలు త్రవ్వడం వంటి జాగ్రత్తలు సూచించాలి.

రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా వరి కొనుగోలు సమర్థవంతంగా కొనసాగేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ విక్టర్, డీఆర్డీఓ సురేందర్, సివిల్ సప్లైస్ అధికారి వెంకటేష్, డీఎం శ్రీకాంత్, డీసీఓ రామ్మోహన్, వ్యవసాయ శాఖ అధికారి మోహన్, మార్కెటింగ్ శాఖ అధికారి రమ్య, తదితరులు పాల్గొన్నారు.

# పదోన్నతులతో బాధ్యతలు పెరుగుతాయి

-రెట్టింపు ఉత్సాహంతో సేవలు అందించాలి: ఎస్పీ రాజేష్ చంద్ర



**కామారెడ్డి మే 4 (మహాప్రభ)**
పోలీసు శాఖలో క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వహించే సిబ్బందికి తగిన గుర్తింపు తప్పక లభిస్తుందని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న పలువురు సిబ్బందికి పదోన్నతులు లభించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.కానిస్టేబుల్ స్థాయి నుంచి హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన వారిలో దోమకొండ పోలీస్ స్టేషన్‌కు చెందిన సిహెచ్. రజినీకాంత్, సదాశివనగర్‌కు చెందిన ఎస్. మురళి మోహన్, దేవునిపల్లి నుంచి ఎస్. శ్రీనివాస్, నసురులాబాద్‌కు చెందిన ఎన్. హరిచంద్ర, బీర్కూర్‌కు చెందిన హెచ్. కిషన్, సీసీఎస్ పోలీస్ స్టేషన్‌కు చెందిన జే. గణపతి, మైసయ్య, బిచ్కుందకు చెందిన కే. జీవన్ ఉన్నారు. అలాగే కామారెడ్డి పోలీస్ స్టేషన్‌కు చెందిన కె. ఎల్లారెడ్డి హెడ్ కానిస్టేబుల్ నుంచి అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ)గా పదోన్నతి పొందారు. వారి సుదీర్ఘ సేవలకు ఇది గుర్తింపుగా ఉన్నతాధికారులు అభిప్రాయపడ్డారు. పదోన్నతి పొందిన సిబ్బంది జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు సమర్పించారు. అనంతరం ఎస్పీ స్వయంగా పదోన్నతి పట్టీలను అలంకరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, "పదోన్నతులు హోదా పెరుగుదలతో పాటు బాధ్యతలను కూడా రెట్టింపు చేస్తాయి. ఇప్పటివరకు చూపిన అంకితభావాన్ని కొనసాగిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలి. శాంతిభద్రతల పరిరక్షణే మన ప్రధాన లక్ష్యం" అని పేర్కొన్నారు.

# జివో నెంబర్ 07 ప్రతులను దగ్ధం

## సామాజికవేత్త శ్రీనివాస్ గౌడ్



**దేవరకొండ మే 4 ( మహాప్రభ )**
దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేయడానికి కుట్రలో భాగంగా జీవో నెంబర్ 07 తీసుకొచ్చి విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారిందని సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2008 సంవత్సరంలో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవడానికి ఫీజు రీయంబర్స్మెంట్ తీసుకొస్తే 2026లో నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దు చేయాలని కుట్ర చేస్తుందని అన్నారు ఫీజు రియంబర్స్మెంట్ జీవో నెంబర్ 7 పత్రులను దగ్ధం చేశారు. గత నాలుగు సంవత్సరాలుగా ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో కొన్ని ప్రైవేట్ కళాశాల యజమాన్యాలు హైకోర్టుని ఆశ్రయించగా రాష్ట్ర ప్రభుత్వం తరపున విద్యార్థుల పక్షాన బలమైన వాదనలు వినిపించాల్సిన ప్రభుత్వం స్కీము దశలవారీగా రద్దు చేసే కుట్రలో భాగంగానే కోర్టుకు సరైన వాదనలు వినిపించలేదని ఆయన ఆరోపించారు. దీనితో విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసుకోవచ్చని రాష్ట్ర హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికైనా ప్రభుత్వం ఇంప్లీడ్ పిటిషన్ వేసి విద్యార్థులకు న్యాయం జరిగే విధంగా చూడాలని ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేసే ఆలోచనను మానుకోవాలని లేని యెడల ప్రభుత్వాన్ని స్తంభింప చేస్తామని అయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, పున్నవెంకటేష్ నేత,పున్న బిక్షమయ్య, భీమగొని శివ గౌడ్, శివ తదితరులు పాల్గొన్నారు.

# రహదారుల పై ధాన్యం ఆరబోయద్దూ...

## -ఎస్ ఐ శ్రీనివాస్ గౌడ్



**పాపన్నపేట మే 4( మహా ప్రభ )**
మండలంలో రహదారుల పై ధాన్యం ఆరబోసిప్రమాదాలకు కారణమైతే చర్యలు తప్పవని ఎస్సై శ్రీనివాస్ గౌడ్ అన్నారు.సోమవారం ఆయన ఎల్లపూర్,మిన్ పూర్, యూసుఫ్ పేట, కొత్తపల్లి గ్రామాల శివార్లలో మెదక్ --- బొడ్మట్ పల్లి రహదారి పై ధాన్యం ఆరబోసిన రైతులతో మాట్లాడుతూ...రైతులు తమ ధాన్యాన్ని రోడ్లపై ఆరబోయడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు.ధాన్యం కుప్పల పక్కన రాళ్లు, కర్రలు పెడుతున్నారని రాత్రివేళ అవి వాహనదారులకు కనిపించక పెద్ద ప్రమాదాలు జరిగే ఆస్కారంఉందన్నారు.వాహనదారులకు ఇబ్బందులు లేకుండా ఖాళీ ప్రదేశాలలో ధాన్యంఆరబోసుకోవాలన్నారు.ధాన్యం కుప్పల వద్ద ప్రమాదాలు జరిగితే చర్యలు తప్పవన్నారు.ప్రజల ప్రయోజనార్థం చర్యలు తీసుకుంటున్నట్లుచెప్పారు.రైతులుసహకరించాలనిసూచించారు.ఆయన వెంట హెడకానిస్టేబుల్ అంజయ్య, కానిస్టేబుల్ లు ప్రవీణ్, వసంత్,మధులుతదితరులున్నారు.

# కామారెడ్డిలో కొత్త మున్సిపల్ కమిషనర్ బాధ్యతలు స్వీకరణ



**కామారెడ్డి మే 4 (మహాప్రభ)**
శంషాబాద్ ఏఎంసీగా విధులు నిర్వహించి బదిలీపై కామారెడ్డికి వచ్చిన టి. పర్వతాలు సోమవారం కామారెడ్డి మున్సిపల్ కమిషనర్గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా కలెక్టర్ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.అదేవిధంగా, నారాయణఖేడ్ మున్సిపల్ కమిషనర్గా పనిచేసి బదిలీపై ఎల్లారెడ్డికి వచ్చిన జగ్జీవన్ ఎల్లారెడ్డి మున్సిపాలిటీ కమిషనర్గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కూడా జిల్లా కలెక్టర్ను కలిసి పూల మొక్కను అందజేశారు. జిల్లాలో మున్సిపల్ పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని ఇద్దరు కమిషనర్లు ఈ సందర్భంగా తెలిపారు.

# పోతారం గ్రామ చెరువు మత్తడి మరమ్మత్తు పనులకు శ్రీకారం



**శివంపేట మే 4 (మహాప్రభ):**
శివంపేట మండల పరిధిలోని పోతారం గ్రామ అభివృద్ధిలో భాగంగా నేడు ఒక ముఖ్యమైన అడుగు పడింది. గ్రామ చెరువు మత్తడి మరమ్మత్తు పనులను గ్రామ సర్పంచ్ పుట్ట వినోదా మహేందర్ గారు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా సర్పంచ్ గారు మాట్లాడుతూ, చెరువు మత్తడి మరమ్మత్తు పనులు పూర్తయిన తర్వాత గ్రామ రైతాంగానికి పెద్ద ఎత్తున ఉపయోగం కలుగుతుందని, భూగర్భ జలాల స్థాయి పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం గ్రామ అభివృద్ధికి మరో ముందడుగుగా నిలిచింది.

# ఉపాధి హామీ సేవల వేగవంతానికి కంప్యూటర్ల పంపిణీ:

## - జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి మే 4 (మహాప్రభ)**
రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయం నుండి సరఫరా చేసిన కంప్యూటర్లను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, చేతుల మీదుగా సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లాలోని 25 మండలాల ఎంపీడీఓలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, "ఉపాధి హామీ పథకంలో పారదర్శకత, వేగవంతమైన సేవల కోసం ప్రతి ఎంపీడీఓ కార్యాలయంలో కంప్యూటర్లు ఏర్పాటు చేస్తున్నాం. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ సిబ్బంది మస్టర్లు, మెజర్మెంట్ బుక్‌లు, బిల్లులు ఆన్‌లైన్‌లోనే పూర్తి చేయాలి. కూలీలకు సకాలంలో వేతనాలు అందేలా ఈ కంప్యూటర్లను సద్వినియోగం చేసుకోవాలి" అని ఆదేశించారు. జిల్లాలోని 25 మండల పరిషత్ కార్యాలయాల్లో ఉపాధి హామీ విభాగాల వినియోగం కోసం ఈ కంప్యూటర్లను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. విక్టర్, జిల్లా జెడ్పీ సీఈఓ చందర్, డీఆర్డీఓ ఎం. సురేందర్, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, తదితరులు పాల్గొన్నారు.

# కూకట్‌పల్లి నూతన జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్‌కు బండి రమేష్ ఘన సత్కారం




**కూకట్‌పల్లి, మే 04 (మహ ప్రభ):**
కూకట్‌పల్లి నూతన జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన మయాంక్ సింగ్‌ను కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, ఉపాధ్యక్షుడు బండి రమేష్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన కార్యాలయానికి వెళ్లిన బండి రమేష్, జోనల్ కమిషనర్‌కు పూల బొకే అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మయాంక్ సింగ్‌కు బండి రమేష్ అభినందనలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో కూకట్‌పల్లి జోన్‌లోని ప్రజా సమస్యలు వేగంగా పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతం అవుతాయని తెలిపారు.
ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి, తూము వేణు, గాలి బాలాజీ, కొప్పిశెట్టి దినేష్, తూము సంతోష్, లక్ష్మయ్య, నారాయణ, రంగమోహన్, సాయి తులసి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# జంతు బలిని అరికట్టాలని ప్రజావాణిలో పిర్యాదు .

**మెదక్ జిల్లా -04మే(మహాప్రభ )**
జంతు బలిని అరికట్టాలని కోరుతూ జీవ కారుణ్య సంస్థ సభ్యులు సోమవారం ప్రజావాణిలో పిర్యాదు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొల్చారం మండలం పోతన్ శెట్టిపల్లి గ్రామంలో నూతనంగా దుర్గామాత దేవత విగ్ర ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా ఈనెల 6(బుధవారం) రోజు ఉదయం జంతుబలి చేయవద్దని దత్తాత్రేయ జీవకారుణ్య స్వచంద సంస్థ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ ను కలిసి వినతి పత్రం అందజేయగా వెంటనే అధనపూ కలెక్టర్ జిల్లా పంచాయతీ అధికారి, రెవెన్యూ యంత్రాంగానికి, పోలీస్ శాఖ మెదక్ డి.ఎస్.పి కి జంతుబలి ఆపాలని అధికారులను ఆదేశించారు. జంతు బలి జరగకుండా జిల్లా యంత్రాంగం గ్రామంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని ఆయన పోలీస్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## రాష్ట్రవ్యాప్తంగా

# గ్రీవెన్స్ డే శుభసూచకం

-రెవెన్యూ డివిజన్లో ఆర్డీవో రమణారెడ్డి ని కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపిన బీసీ సంక్షేమ సంఘం డివిజన్ నాయకులు




**దేవరకొండ మే 4 ( మహాప్రభ)**
దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దేవరకొండ ఆర్డీవో ఆఫీస్ కు వెళ్లి ఆర్డీవో రమణారెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిసి గ్రీవెన్స్ డేవిజన్లో ఏర్పాటు చేయడం శుభదాయకమని కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను శాలువతో సత్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజావాణి అన్ని రెవెన్యూ డివిజన్లో ఏర్పాటుచేసి ప్రజల సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ఈ కార్యక్రమం మంచిదని రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రివర్యులు యనమల రేవంత్ రెడ్డి గారికి, మంత్రి మండలి సభ్యులకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రీవెన్స్ డే లో అధికారులు ప్రజల సమస్యలపై అవగాహన కలిగి శాశ్వత పరిష్కార దిశగా కృషి చేయాలని ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండే అధికారులు ప్రభుత్వము ప్రజల యొక్క మన్ననలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్, రెడ్డి కోటేశ్వరరావు, పున్న వెంకటేష్ నేత, రామావత్ రాజు నాయక్, కంబాలపల్లి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు

# ముఖ్యమంత్రి సహాయ నిధి రూ. 2,00,0 00 మంజూరు

## -శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్




**దేవరకొండ మే 4 (మహాప్రభ)**
నియోజకవర్గంలోని గుడిపల్లి మండల పరిధిలోని ఘణపురం గ్రామానికి చెందిన రెడ్డి మల్ల ఎల్లయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ముచ్చర్ల శ్రీకాంత్ ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాలు నాయక్ వెంటనే స్పందించి ఎల్లయ్య చికిత్సకి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ. 2,00,000/-లు ఎల్.ఓ.సి మంజూరు చేశారు

# చలివేంద్రాన్ని ప్రారంభించిన మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి




**అల్వాల్ మే 4 (మహప్రభ)**
తుర్కపల్లి బొల్లారం రైల్వే స్టేషన్ సమీపంలో చలివేంద్రం ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి రోజురోజుకూ పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యల్లో భాగంగా మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తుర్కపల్లి బొల్లారం రైల్వే స్టేషన్ సమీపంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. తీవ్ర ఎండల కారణంగా పాదాచారులు, కార్మికులు, ప్రయాణికులు దాహంతో ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని గుర్తించి, వారికి ఉచిత తాగునీటి సదుపాయం కల్పించాలనే ఉద్దేశంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చలివేంద్రం ద్వారా స్థానిక ప్రజలు, రోజువారీ కూలీలు, ప్రయాణికులు తాగునీటిని సులభంగా పొందుతూ వేసవి తాపాన్ని తట్టుకునేలా సహాయం అందుతుందని పేర్కొన్నారు. చలివేంద్రం ఏర్పాటుకు సహకరించిన బిఆర్ఎస్ నాయకుడు భాస్కర్ రెడ్డిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల సేవే తమ ప్రధాన ధ్యేయమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్ రెడ్డి, శోభన్, పుట్నాల కృష్ణ, జేఏసీ వెంకన్న, వెంకటేష్, అరుణ్ రావు, జావేద్ మరియు బిఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులుకార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు .. పేదలకు వరం



**పాపన్నపేట, మే 4 (మహాప్రభ )**
ఇందిరమ్మ ఇండ్ల పథకం పేదలకు వరం లాంటిదని పాపన్నపేట గ్రామ సర్పంచ్ పావని నరేందర్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం పాపన్నపేటలో అచ్చుకట్ల రాణి రమేష్ నూతన గృహాన్ని ఆమె అధికారులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సతీష్ కుమార్,ఎంపీడీవో విష్ణువర్ధన్,హౌసింగ్ ఏఈ అరుణ్ ప్రసాద్ గౌడ్,ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్,ఉప సర్పంచ్ సద్దామ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు .

## మద్యం మత్తులో ఆర్టీసీ బస్సు డ్రైవింగ్

-- నర్సాపూర్‌లో ప్రయాణికుల ఆందోళన



**నర్సాపూర్ మే 4 (మహాప్రభ):**
మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ప్రమాదకర పరిస్థితి తలెత్తింది. మద్యం సేవించి బస్సు నడుపుతున్నాడని గుర్తించిన ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేయడంతో ఆర్టీసీ బస్సును నర్సాపూర్ బస్టాండ్‌లో నిలిపివేశారు.
మేడ్చల్ డిపోకు చెందిన తిరుమలేష్ అనే డ్రైవర్ మద్యం సేవించి బస్సు నడుపుతున్నాడని బస్సులో ఉన్న ప్రయాణికులు గుర్తించారు. వెంటనే వారు నర్సాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిర్వహించిన బ్రెతింగ్ పరీక్షలో డ్రైవర్ మద్యం సేవించినట్లు నిర్ధారణ అయింది. ఈ బస్సు మేడ్చల్ నుండి నర్సాపూర్‌కు వస్తుండగా దాదాపు 70 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. డ్రైవర్ ప్రవర్తనపై అనుమానం వచ్చి, అతను చిరాకు పడటంతో ప్రయాణికులు విషయం గుర్తించినట్లు తెలిపారు. ప్రయాణికుల సమాచారం మేరకు వెంటనే స్పందించిన నర్సాపూర్ ఆర్టీసీ అధికారులు బస్సును బస్టాండ్‌లో నిలిపివేశారు.

## ప్రజావాణి ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చేయాలి.

-ప్రజావాణిలో బాధితులకు భరోసా కల్పించిన మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్.




**మెదక్ జిల్లా -04మే (మహాప్రభ )**
ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని పలు గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎస్పీకి నేరుగా విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ప్రతి ఫిర్యాదుదారునితో వ్యక్తిగతంగా మాట్లాడిన ఎస్పీ, వారి సమస్యలను సమగ్రంగా తెలుసుకున్నారు. అందిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్‌ఇన్‌స్పెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. కొన్ని అంశాలపై ఎస్‌హెచ్‌ఓలతో ఫోన్‌లో మాట్లాడి వేగవంతమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ పోలీస్ శాఖ అందుబాటులో ఉంటుందని, ఎలాంటి పైరవీలు అవసరం లేకుండా నేరుగా అధికారులను సంప్రదించాలని ఎస్పీ తెలిపారు. చట్టపరమైన మార్గంలో ప్రతి ఒక్కరికీ న్యాయం అందించడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ఇప్పటికే అనేక సమస్యలు పరిష్కారమై ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకం పెరిగిందని ఎస్పీ తెలిపారు.

## ట్రాక్టర్ నుంచి పడి వ్యక్తికి తీవ్ర గాయాలు



**గాంధారి, మే 4 (మహా ప్రభ)**
ట్రాక్టర్ పై నుంచి వ్యక్తికి తీవ్ర గాయాలు గాంధారి మండలం పొతంగల్ కలాన్ గ్రామానికి చెందిన రాజ్ మహమ్మద్ సోమవారం ట్రాక్టర్ పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి గుంతలో పడింది. దీంతో రాజ్ మహమ్మద్ కి తీవ్రంగా గాయాలు అయ్యాయి. స్థానికులు గమనించి 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. స్పందించిన 108 సిబ్బంది గాయాలైన రాజ్ మహమ్మద్ ఆసుపత్రికి తరలించారు. అంబులెన్స్ సిబ్బందికి గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## జాతరలో భక్తులకు ఉచితంగా వాటర్ బాటిల్స్ పంపిణీ




**శివంపేట, మే 4 (మహా ప్రభ):**
శివ్వంపేట తాజా మాజీ జడ్పీటీసీ, ప్రముఖ సంఘ సేవకులు పబ్బ మహేష్ గుప్త తమ సొంత నిధులతో సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా దొంతి గ్రామంలో శ్రీ వేణుగోపాల స్వామి జాతర సందర్భంగా భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు వాటర్ బాటిల్స్ పంపిణీ చేయడం జరుగుతోంది. జాతరకు భారీగా తరలివస్తున్న భక్తులకు ఈ సేవ ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోంది. సేవాభావంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని స్థానికులు అభినందిస్తున్నారు.

# జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

-- 91 మందిపై కోర్టు శిక్షలు
- మొత్తం 1,13,600/- జరిమానా విధింపు
-11 మందికి జైలు శిక్షలు విధింపు
-ఒక్క క్షణం అజాగ్రత్త... జీవితాంతం విషాదం, ఒక్క తప్పు... ఎన్నో ప్రాణాలకు ముప్పు
-మద్యం మత్తులో డ్రైవింగ్‌పై జిల్లా పోలీసుల కఠిన చర్యలు
--- జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్



**కామారెడ్డి మే 4 (మహాప్రభ)**
జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించడం మరియు ప్రజల ప్రాణాలను రక్షించడం లక్ష్యంగా కామారెడ్డి జిల్లా పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్‌పై నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల అమాయకుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని, ఇలాంటి నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని పోలీసులు హెచ్చరిస్తున్నారు.
సోమవారం రోజున జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో మొత్తం 91 కేసులు నమోదు కాగా, మొత్తం ?1,13,600/- జరిమానా విధించబడింది. అదనంగా 11 మందికి జైలు శిక్షలు విధించగా, అందులో 7 మందికి ఒక రోజు, 2 మందికి రెండు రోజుల పాటు, మరో 2 మందికి మూడు రోజుల పాటు జైలు శిక్షలు విధించారు.
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ మాట్లాడుతూ, "ప్రతిరోజూ మీరు ఇంటి నుండి బయటకు వెళ్లేటప్పుడు మీ కుటుంబ సభ్యులు చెప్పే 'జాగ్రత్తగా వెళ్లండి' అనే మాటలో మీపై ఉన్న ప్రేమ, మీరు క్షేమంగా తిరిగి రావాలనే ఆశ దాగి ఉంటుంది. అయితే రోడ్డుపై చేసే ఒక చిన్న అజాగ్రత్త ఆ కుటుంబాన్ని జీవితాంతం విషాదంలోకి నెట్టివేస్తుంది. రోడ్డు ప్రమాదం అనేది కేవలం ఒక సంఘటన కాదు... అది ఒక తల్లి కన్నీరు, ఒక తండ్రి మౌనం, ఒక చిన్నారి జీవితాంతం మిగిలే బాధ. క్షణిక ఆనందం కోసం మద్యం సేవించి వాహనం నడపడం ద్వారా మీతో పాటు ఇతరుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టవద్దు" అని తెలిపారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడితే భారీ జరిమానాలతో పాటు జైలు శిక్షలు తప్పవని, ఇది వ్యక్తిగత భవిష్యత్తు మరియు కెరీర్‌పై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించి, సురక్షిత ప్రయాణాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు.

# పశ్చిమ బెంగాల్, అసోం రాష్ట్రాల్లో బీజేపీ ఘన విజయం

- మెదక్ పట్టణంలో సంబరాలు



**మెదక్ జిల్లా -04మే (మహాప్రభ ).**
పశ్చిమబెంగాల్, అసోం రాష్ట్రాలలో బీజేపీ ఘన విజయం సాధించిన సందర్భంగా మెదక్ పట్టణంలో పట్టణ అధ్యక్షుడు నాయినీ ప్రసాద్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్. కిసాన్ మోర్చా అధ్యక్షుడు సత్యనారాయణ. ఓబిసి మోర్చా మెదక్ జిల్లా అధ్యక్షుడు గడ్డం కాశీనాథ్. మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లాల విజయ్ ఎం ఎల్ ఎన్ రెడ్డి. బిజెపి సీనియర్ నాయకులు లోకేష్ ఇప్ప భరత్. స్వామి శివ . అల్లం మధు అంకం శ్రీనివాస్ బబ్లు సన్నీ గోవిందరాజ్ రాహుల్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ భారత దేశంలో కాశ్మీర్ తర్వాత అత్యంత కిరాతక పాలన పశ్చిమబెంగాల్లో సాగుతుందని వారి వల్ల ప్రజలు నానా ఇబ్బందులు పడడాన్ని భారతీయ జనతా పార్టీ గమనించి ఈ దేశంలోని ప్రతి పౌరునికి భారత ప్రభుత్వం అండగా ఉంటుంది అని భరోసా ఇచ్చారు. అలాంటి తరుణంలో భారతీయ జనతా పార్టీ పశ్చిమబెంగాల్లో పోటీ చేయడానికి వెళితే బిజెపి నాయకులను కార్యకర్తలను టిఎంసి నాయకురాలు మమతా బెనర్జీ ఈ రాష్ట్రం మాది మేమే అధికారంలో ఉన్నాం అనే దురాకారంతో ప్రజలకు తను చెప్పిందే వేదం అంటూ ఎంతోమంది అమాయకుల ప్రాణాలను బలిగొన్న రాక్షసి మమతా బెనర్జీ రాక్షస పాలన ను అడ్డుకుంది బీజేపీ.. భారతీయ జనతా పార్టీ టి యం సి ప్రభుత్వం గుండారాజ్యంపై పోరాటం చేసి పక్క దేశంలో ఉన్న బంగ్లాదేశ్ లను కట్టడి చేసి నేడు భారతీయ జనతా పార్టీ అఖండ విజయం సాధించి రెండు వందల సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించినందుకు హర్షిస్తూ సంబరాలు జరుపుకోవడం జరిగింది మరి తెలంగాణలో కూడా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బిజెపి పార్టీ అధికారంలోకి వస్తుందనీ ధీమా వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో ఈ దేశంలో అనేక సంస్కరణ తీసుకొచ్చి ఈ దేశ సార్వభౌమత్వానికి గాని ఈ దేశ పారిశ్రామిక రంగానికి గాని ఎనలేని సేవలు చేస్తున్న నరేంద్ర మోడీ అమిత్ షా అనేక మంది కేంద్ర మంత్రులు ముఖ్యమంత్రులు ఈరోజు భారతీయ జనతా పార్టీని విజయ తీరాన నిలబెట్టడం శుభ సూచికంగా భావిస్తున్నామని తెలిపారు.. శ్యామ ప్రసాద్ ముఖర్జీ పశ్చిమబెంగాల్లో జన్మించి ఈ దేశ సంకెళ్ల నుండి విముక్తి కోసం పోరాటం చేసి భారతీయ జనతా పార్టీ అధికారంలో రావాలన్నటువంటి సదుద్దేశంతో వారు స్థాపించిన భారతీయ జనతా పార్టీ వారి సొంత రాష్ట్రము పశ్చిమబెంగాల్లో అఖండ విజయం సాధించడం వారికి ఈ గెలుపు అంకితమని అని తెలిపారు..

## అంగరంగ వైభవంగా శ్రీ వేణుగోపాల స్వామిబ్రహ్మోత్సవాలు





**శివంపేట మే 4 (మహాప్రభ)**
శివ్వంపేట మండలం దొంతి గ్రామంలో నిర్వహించిన శ్రీ వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలలో ముఖ్య నాయకులు ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, చింతల వెంకటరామిరెడ్డి, పులిమామిడి నవీన్ గుప్తా మరియు వివిధ గ్రామాల సర్పంచులు, భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారి పల్లకి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ ఉత్సవం లో పరిసర గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రూ. లక్ష లంచం తీసుకుంటూ జూనియర్ అసిస్టెంట్ ఏసీబీకి చిక్కింది




**హైదరాబాద్, మే 04 ( మహాప్రభ)**
లంచం తీసుకుంటూ ఓ అవినీతి అధికారిని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బోరబండలోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీలత ఇంటి నిర్మాణ అనుమతి ఫైల్ క్లియర్ చేయడానికి బాధితుడి వద్ద నుంచి రూ.5 లక్షల లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. అందులో భాగంగా ముందస్తుగా రూ.1 లక్ష లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి ఆమెను పట్టుకున్నారు. అనంతరం శ్రీలతను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.
ఈ ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగుతోందని ఏసీబీ అధికారులు వెల్లడించారు.


## నర్సాపూర్‌లో రైతు వారోత్సవాలు

-శాస్త్రీయ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం




**నర్సాపూర్, మే 4(మహాప్రభ):**
తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం నాడు నర్సాపూర్ లో రైతు వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేల ఆరోగ్య సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించగా, మట్టి నమూనాలు సేకరించే విధానం, మట్టి పరీక్షల ప్రాముఖ్యతను అధికారులు వివరించారు. మట్టి ఆరోగ్య కార్డులను రైతులకు పంపిణీ చేసి, ఫలితాల ఆధారంగా సరైన ఎరువుల వినియోగంపై సూచనలు అందించారు. అలాగే సేంద్రీయ మరియు ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యతను వివరించడంతో పాటు, సమతుల ఎరువుల యాజమాన్యంపై క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. వరి పంటకు ప్రత్యామ్నాయంగా కుసుమ, ఆయిల్ పామ్ వంటి పంటల సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామకృష్ణ రావు, వ్యవసాయ అధికారి దీపిక, మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ, హార్టికల్చర్ అధికారి రచన, వ్యవసాయ విస్తరణ అధికారి మోహన్ మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## ఎంపీ డీకే అరుణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ముచ్చర్ల జనార్దన్ రెడ్డి



**మిడ్జిల్,మే 4 (మహా ప్రభ):**
మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీ.కే అరుణ జన్మదినాన్ని పురస్కరించుకుని, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి మర్యాదపూర్వకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శంషాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆమెను కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. డీకే అరుణ ప్రజాసేవలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఆమెకు దీర్ఘాయుష్షు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు కూడా పాల్గొన్నారు.

# బిజినెస్

## స్టాక్ మార్కెట్లకు ఎలక్షన్ రిజల్ట్స్ బూస్ట్..

### -లాభాల్లో ముగిసిన సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం లాభాల్లో ముగిశాయి. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలకు తోడు, అసెంబ్లీ ఎన్నిక ఫలితాలు సూచీలపై ప్రభావం చూపాయి. పశ్చిమ బెంగాల్ లో భారతీయ జనతా పార్టీ విజయం దిశగా దూసుకెళ్తుండటం పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. అయితే ఓ దశలో వెయ్యి పాయింట్ల మేర లాభపడిన సెన్సెక్స్.. ఆ తర్వాత మోస్తరు లాభాలకే పరిమితం అయ్యింది.బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 77,257.27 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 77,910.75 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 355.90 పాయింట్ల లాభంతో 77,269.40 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 121.75 పాయింట్ల లాభంతో 24,119.30 వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 95.08 వద్ద ఆల్‌టైమ్ కనిష్ఠానికి చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, హిందుస్థాన్ యూనిలీవర్, రిలయన్స్, ఎల్‌అండ్‌టీ, ఎటర్నల్ స్టాక్స్ రాణించాయి. భారతీ ఎయిర్‌టెల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, టీసీఎస్, ఐటీసీ, ఇన్ఫోసిస్ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి.అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 113 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4545 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. మొత్తానికి అసెంబ్లీ ఎన్నికల్లో అన్నిచోట్ల స్పష్టమైన మెజారిటీలు రానుండటం మార్కెట్‌లకు జోష్ నిచ్చింది. స్థిరమైన ప్రభుత్వాలు ఏర్పాటైతే మార్కెట్‌లు ఒడిదొడుకుల లోనయ్యే ప్రమాదం ఉండదు. ఏదో ఒక పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఉంటే స్థిరమైన ప్రభుత్వం ఏర్పాటవుతుంది. అప్పుడు ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపుతారు.

## మహిళలకు గుడ్‌న్యూస్.. ఒక్క రోజే భారీగా దిగి వచ్చిన బంగారం ధర.. వెండి పరిస్థితి ఏంటి?



మవారం బంగారం ధరలు భారీగా పతనం అయ్యాయి. ఉదయం స్వల్పంగా తగ్గినా తర్వాత మాత్రం భారీ స్థాయిలో తగ్గుముఖం పట్టాయి. పెళ్లిళ్ల సీజన్‌లో ధరలు తగ్గడంతో భారతీయ కుటుంబాలు ఊపిరి పీల్చుకున్నాయి. సోమవారం ఉదయంతో పోలిస్తే మధ్యాహ్నం సమయానికి తులం బంగారంపై ఏకంగా రూ.1300లకుపైగా తగ్గింది. అదే గత గురువారంతో పోలిస్తే రూ.1900 వరకు దిగి వచ్చింది.గుడ్ రిటర్న్స్ వివరాల ప్రకారం.. ధర తగ్గిన తర్వాత బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,49,620 వద్ద కొనసాగుతుండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,37,150 వద్ద ట్రేడవుతోంది. అలాగే 18 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,12,220 వద్ద ట్రేడవుతోంది.

హైదరాబాద్, విజయవాడలో తులం బంగారం ధర రూ.1,49,620 వద్ద ఉండగా, అదే ఢిల్లీలో రూ.1,49,770 వద్ద కొనసాగుతోంది. ఇక్కడ కాస్త ఎక్కువగా ఉంది. అదే చెన్నైలో మాత్రం ఇంకా ఎక్కువగా ఉంది. ఇక్కడ తులం బంగారం ధర రూ.1,52,730 కొనసాగుతోంది. ఇంటే ఇతర ప్రాంతాలతో పోలిస్తే దాదాపు 2000 రూపాయలకుపైగానే ఉంది.

**ఇక వెండి పరిస్థితి ఏంటి?**

బంగారం ధరలు తగ్గుముఖం పడుతుండగా, వెండి పరిస్థితి మాత్రం పెద్దగా తేడా లేదు. సిల్వర్ ధర నిలకడగానే ఉంది. సాయంత్రం 4.30 గంటల సమయంలో కేజీ సిల్వర్ ధర రూ.2,65,000 ఉంది. అదే హైదరాబాద్, చెన్నై, కేరళ ప్రాంతాల్లో కిలో వెండి ధర రూ.2,70,000 వద్ద కొనసాగుతోంది.

**బంగారం ధర ఎందుకు పడిపోతోంది**

బంగారం ధరలలో కొనసాగుతున్న తగ్గుదలకు ముడి చమురు, డాలర్ సూచీ కారణమవుతున్నాయి. ముడి చమురు ధరలలో నిరంతర పెరుగుదల ప్రపంచ ద్రవ్యోల్బణ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తోంది. కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లను పెంచవచ్చు.

డాలర్ సూచీ కూడా నిరంతరం బలంగా కొనసాగుతోంది. దీనివల్ల పెట్టుబడిదారులు బంగారానికి బదులుగా డాలర్లలో పెట్టుబడి పెడుతున్నారు. ఇది కూడా బంగారం ధరలు పడిపోవడానికి కారణమవుతోంది. దీనికి తోడు, బంగారం ధరలు రికార్డు స్థాయికి చేరడంతో పెట్టుబడిదారులు దూరంగా ఉంటున్నారు. బలహీనమైన సెంటిమెంట్ కూడా బంగారం ధరలపై ప్రభావం చూపింది.

## బహుమతిగా మ్యూచువల్ ఫండ్స్..




**పిల్లలకు బదిలీ ముందు తల్లిదండ్రులు తెలుసుకోవాల్సిందేంటి?**

మీ పిల్లలకు మ్యూచువల్ ఫండ్స్‌ను బహుమతిగా ఇవ్వాలనుకుంటున్నారా? అయితే ఈ కొత్త నిబంధనలను తెలుసుకోవాల్సిందే. నిజానికి పిల్లల దీర్ఘకాల సంపద నిర్మాణానికి మ్యూచువల్ ఫండ్స్ బహుమతి అనేది ఎప్పట్నుంచో ఉన్న చక్కని మార్గం. కానీ ఇటీవల వచ్చిన రూల్స్.. ఈ ప్రక్రియను చాలా సంక్లిష్టం చేశాయి. కాబట్టి డీమ్యాట్ అవసరాల నుంచి పన్ను సమస్యల వరకున్న నూతన విధివిధానాలను తల్లిదండ్రులు తప్పక తెలుసుకోవాలి. అప్పుడే పొరపాట్లను అధిగమించి అనుకున్నది సజావుగా సాగగలదు

నగదు, బంగారంలా కాకుండా.. మ్యూచువల్ ఫండ్ యూనిట్లను పన్ను చట్టం కింద మూలధన ఆస్తులుగా పరిగణిస్తారు. అందుకే బదిలీ, పన్నుల విషయంలో కొన్ని నిబంధనలు వర్తిస్తాయి.

మ్యూచువల్ ఫండ్ యూనిట్లను డీమ్యాట్ రూపంలోనే బహుమతిగా ఇవ్వవచ్చు. కనుక తల్లిదండ్రులు తమ హోల్డింగ్స్‌ను ముందే డీమ్యాట్‌లోకి మార్చాలి. గిఫ్ట్ డీడ్‌ను సృష్టించాలి.

డీమ్యాట్ రూపంలోకి మారిన తర్వాత మీ బహుమతిని ఆఫ్-మార్కెట్ మార్గదర్శకాల ఆధారంగా బదిలీ చేసుకోవచ్చు. ఇందుకు రూ.25 లేదా బదిలీ విలువలో 0.03 శాతాన్ని (ఏది ఎక్కువైతే అది) ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. దీనికి జీఎస్టీ, స్టాంప్ సుంకం అదనం.

పన్ను చట్టాల కింద బహుమతులకు మినహాయింపు ఉన్నందున మీ మ్యూచువల్ ఫండ్స్ బహుమతిపై మూలధన లాభాల పన్ను ఉండదు.

తల్లిదండ్రుల నుంచి మ్యూచువల్ ఫండ్స్‌ను బహుమతిగా తీసుకొనే పిల్లలూ పన్నుల్ని చెల్లించనక్కర్లేదు. అయితే కొంత కాలం తర్వాత వాటిని అమ్ముకున్నప్పుడు మాత్రం మూలధన లాభాల పన్నును చెల్లించాల్సి ఉంటుంది.

పిల్లలు మైనర్లుగా ఉంటే.. బహుమతిగా ఇచ్చిన మీ మ్యూచువల్ ఫండ్స్ నుంచి వచ్చే ఆదాయం మీ (తల్లిదండ్రులు) ఆదాయం కిందకే వస్తాయి. అయినప్పటికీ ఏటా రూ.1,500 వరకు ఆదాయంపై పన్ను మినహాయింపు ఉంటుం ది. ఈ పరిమితి దాటితే మీ ఐటీ శ్లాబుల ప్రకారం పన్నులు తప్పవు. పిల్లల వయసు 18 ఏండ్లు నిండేదాకా ఇంతే.

# స్పోర్ట్స్

## లీగ్ దశ ముగుస్తున్నా ధోనీ జాడేది..

### చెన్నై ఎదురుచూపులు ఫలించేనా..!



ఐపీఎల్ ప్రతి సీజన్‌లో అభిమానులకు పిచ్చెక్కించే ఎంఎస్ ధోనీ పంతొమ్మిదో సీజన్‌లో ఇంకా అడుగే పెట్టలేదు. లీగ్ దశ ముగింపు దశకు చేరుకున్నా తాలా ఆటను ఫ్యాన్స్ మిస్సవుతున్నారు. ఆరంభ సీజన్ నుంచి వికెట్ల వెనకాల కుర్రాడిలా కదులుతూ.. ఫినిషర్‌గా సీఎస్కే విజయాల్లో కీలకమైన ధోనీ 19వ ఎడిషన్‌లో ఒక్క మ్యాచ్ ఆడలేదు. ఇదుగో వస్తుండు.. అదుగో వస్తుండు అనే మాటలు వినిపిస్తున్నా.. ఈ మాజీ కెప్టెన్ ఎంట్రీపై సీఎస్కే యాజమాన్యం స్పష్టమైన ప్రకటన చేయడం లేదు.చెన్నై సూపర్ కింగ్స్‌ను ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిపిన ధోనీ పంతొమ్మిదో సీజన్‌లో ఆడడంపై నెలకొన్ని అనిశ్చితికి తెరపడడం లేదు. మొన్నటికి మొన్న జట్టుతో పాటు హైదరాబాద్ వచ్చినా అతడు ఆడలేదు. రెండు రోజుల క్రితం ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌కు ముందు నెట్స్‌లో రోహిత్ శర్మను కలిసిన ధోనీ.. తుది జట్టులో ఉంటాడని అందరూ అనుకున్నారు.కానీ, ఆశ్చర్యంగా.. ఎల్ క్లాసికో మ్యాచ్‌కు ధోనీ, హిట్‌మ్యాన్ వరసగా రెండోసారి దూరమయ్యారు. మే 5న ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్ కోసం జట్టంతా ఢిల్లీ వెళ్లగా ధోనీ చెన్నైలోనే ఉండిపోవడం అతడి రాక మరింత ఆలస్యం కానుందనే వార్తలకు బలం చేకూర్చుతోంది.

**వయసూ కారణమే..!**

పంతొమ్మిదో సీజన్ ముందు గాయపడిన ధోనీ.. కాలి పిక్క గాయం నుంచి కోలుకుంటున్నాడు. పూర్తి స్థాయిలో ఫిట్‌నెస్ సాధించకపోవడంతోనే ఐపీఎల్ ఆడడం లేదని సమాచారం. వయసు 44 ఏళ్లు కావడంతో ధోనీ ఫిట్‌గా మారేందుకు మరికొంత సమయం పట్టనుంది. దాంతో.. చెన్నైలోనే తాలా పునరావాస కేంద్రంలో ఫిట్‌నెస్ మెరుగుపరుచుకుంటున్నాడు.ఈ నేపథ్యంలో.. ధోనీ ఏదో ఒక దశలో అందుబాటులో ఉంటాడు అని క్రిక్‌బజ్ కథనం పేర్కొంది. పెద్దన్నలాంటి మహీ భాయ్ గైర్హాజరీలో రుతురాజ్ గైక్వాడ్ ఆరంభంలో తడబడినా ఎట్టకేలకు ట్రాక్‌లో పడ్డాడు. ఓపెనర్ శాంసన్.. మిడిలార్డర్‌లో ఉర్విల్, కార్తిక్ శర్మ.. పేసర్ అన్షుల్ కంబోజ్‌లు రాణిస్తుండగా చెన్నై నాలుగో విజయంతో ప్లే ఆఫ్స్ రేసులో నిలిచింది.


## మూడు ఫార్మాట్లు ఆడుతాను

### పాకిస్థాన్ మాజీ కెప్టెన్ బాబర్ ఆజామ్



పాకిస్థాన్ తరఫున మూడు ఫార్మాట్లు ఆడుతానని పాకిస్థాన్ మాజీ కెప్టెన్ బాబర్ ఆజామ్ స్పష్టం చేశాడు. ఈ విషయంలో సందేహం అక్కర్లేదన్నాడు. పాకిస్థాన్ సూపర్ లీగ్(పీఎస్ఎల్) 2026 సీజన్‌లో తాను సారథ్యం వహించిన పెషావర్ జల్మీ టీమ్‌ను బాబర్ ఆజామ్ విజేతగా నిలబెట్టాడు. ఈ టోర్నీలో బాబర్ ఆజామ్ 588 పరుగులతో సత్తా చాటాడు.గత కొద్ది రోజులుగా పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడిన బాబర్ ఆజామ్.. పీఎస్ఎల్‌తో టచ్‌లోకి వచ్చాడు. ఒకప్పుడు కోహ్లితో పోటిపడిన బాబర్ ఆజామ్.. ఫామ్ కోల్పోయి పాకిస్థాన్ జట్టులో చోటు కూడా కోల్పోయాడు. అయినా పట్టువదలని బాబర్ ఆజామ్.. పీఎస్ఎల్‌లో సత్తా చాటి పాకిస్థాన్ జట్టులోకి రీఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు.పీఎస్ఎల్ 2026 సీజన్ విజయానంతరం మీడియాతో మాట్లాడిన బాబర్ ఆజామ్.. ఏ ఫార్మాట్‌లకు ప్రాధాన్యత ఇస్తారని మీడియా ప్రతినిధి ప్రశ్నించగా.. 'టెన్షన్ వద్దు. మూడు ఫార్మాట్లు ఆడుతాను.'అని బాబర్ ఆజామ్ స్పష్టం చేశాడు. క్రికెటర్లు ఫార్మాట్‌లను ఎంచుకోవద్దని అభిప్రాయపడ్డాడు. ప్రతీ ప్లేయర్ మూడు ఫార్మాట్లు ఆడాలని, అలా చేయడం వల్ల వారి సామర్థ్యాలు మెరుగుపడుతాయని తెలిపాడు. 'ఆటగాడు కేవలం ఆడటానికే. ప్రతి ఒక్కరూ అన్ని ఫార్మాట్‌లు ఆడాలి, టీ20లు, వైట్ బాల్‌కే పరిమితం కాకూడదు. రెడ్ బాల్ క్రికెట్ అపారమైన అనుభవాన్ని, ఇన్నింగ్స్ నిర్మాణం, సహనాన్ని అందిస్తుంది. దేశవాళీ నాలుగు రోజుల క్రికెట్ భారీ ఇన్నింగ్స్‌లు ఆడే అనుభవం ఇస్తుంది. ఒక ఫార్మాట్ ఆడటం వల్ల మరొక ఫార్మాట్‌కు సహాయపడుతుంది .రెడ్ బాల్ గేమ్ టీ20లు, వన్డేల్లో మేలు చేస్తుంది. టెస్ట్ మ్యాచ్‌ల్లో పెంపొందించుకునే సహనం, మానసిక స్థితి వైట్-బాల్ క్రికెట్‌లో ఉపయోగపడుతుంది. గత కొద్ది రోజులుగా బ్యాటింగ్‌లోనాపై పెట్టుకున్న అంచనాలను అందుకోలేకపోయాను. ఇలా జరగడం మామూలే. కొన్నిసార్లు ప్రణాళికలు సరిగ్గా అమలు కావు. మీరు ఎంత ప్రయత్నించినా.. కొన్ని విషయాలు మీకు అనుకూలంగా ఉండవు.ఇలాంటి పరిస్థితుల్లో రెండు అడుగులు వెనక్కి వేసి, స్వీయ విశ్లేషణ చేసుకోవాలన్నాడు. తప్పులను విశ్లేషించి వాటిని సరిదిద్దుకోవాలి. నేను అదే చేశాను. నా సన్నిహితులు అపారమైన మద్దతు ఇచ్చారు. నా కుటుంబం, స్నేహితులు నన్ను ప్రోత్సహించారు. కోచ్‌లతో మాట్లాడి, నా ఆటను మెరుగుపర్చుకున్నాను. ప్రపంచకప్ నుంచి వచ్చాక సరిగ్గా రాణించలేకపోయాను. చాలా నిరుత్సాహానికి లోనయ్యాను. పీఎస్ఎల్‌కు పది రోజులు మాత్రమే సమయం ఉండగా.. నా తప్పులు, గేమ్ ప్లాన్ మార్పులను పరిశీలించుకున్నాను. నా టెక్నిక్, మానసిక స్థితిపై పనిచేశాను. నేను నా సహజమైన ఆటను ఆడుతాను. నా క్రికెటింగ్ షాట్స్‌కు కట్టుబడి ఉంటాను. పిచ్, మ్యాచ్ పరిస్థితి, జట్టు డిమాండ్ ఏదైతే.. దాన్ని అమలు చేయాలని నిర్ణయించుకున్నా'అని బాబర్ ఆజామ్ ముగించాడు.

## బ్యాటింగ్ వైఫల్యంతో సన్ కు ఓటమి..



సొంతగడ్డపై డబుల్ హ్యాట్రిక్ విజయాలు సాధించాలని ఉవ్విళ్లూరిన సన్ రైజర్స్ కు భంగపాటు ఎదురైంది. ఆదివారం డబుల్ హెడర్ లో భాగంగా కోల్ కతా నైట్ రైడర్స్ తో జరిగిన మ్యాచ్ లో - వికెట్లతో పరాజయం పాలైంది. అంతకుముందు టాస్ గెలిచి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన సన్ రైజర్స్ 19 ఓవర్లలోనే 165 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ ట్రావిస్ హెడ్ సూపర్బ్ ఫిఫ్టీ (28 బంతుల్లో 61, 9 ఫోర్లు, 3 సిక్సర్లు) తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. వరణ్ చక్రవర్తికి మూడు వికెట్లు దక్కాయి. అనంతరం కేకేఆర్ టార్గెట్ ను ఈజీగా ఛేజ్ చేసింది. కేవలం 18.2 ఓవర్లలో 3వికెట్లకు 169 పరుగులు చేసి గెలుపొందింది. వన్ డౌన్ బ్యాటర్ అంగ్ క్రిష్ రఘువంశీ స్టన్నింగ్ ఫిఫ్టీ (47 బంతుల్లో 59, 5 ఫోర్లు, 2 సిక్సర్లు) తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. కమిన్స్, శివాంగ్, సాఖిబ్ హుస్సేన్ కు తలో వికెట్ దక్కింది. ఈ విజయంతో కోల్ కతా తన ప్లే ఆఫ్ అవకాశాలను సజీవంగానే ఉంచుకుంది. మరోవైపు ఈ మ్యాచ్ లో గెలిస్తే టేబుల్ టాపర్ అయ్యే సువర్ణావకాశాన్ని సన్ చేజార్చుకుంది. ఓ మాదిరి టార్గెట్ తో బరిలోకి దిగిన కేకేఆర్ కు ఓపెనర్లు ఫిన్ అలెన్ (13 బంతుల్లో 29, 3 ఫోర్లు, 2 సిక్సర్లు), కెప్టెన్ అజింక్య రహానే (36 బంతుల్లో 43, 4 ఫోర్లు, 1 సిక్సర్) అద్భుత ఆరంభాన్ని ఇచ్చారు. ముఖ్యంగా మళ్లీ జట్టులోకి వచ్చిన ఫిన్.. ఆరంభ ఓవర్ నుంచి సిక్సర్లతో రెచ్చిపోయాడు. తక్కువ సమయమే గడిపినా కానీ ఇంపాక్ట్ వేశాడు. ఎట్టకేలకు అతడిని కమిన్స్ పెవిలియన్ కు పంపాడు. ఆ తర్వాత రఘువంశీతో కలిసి ఇన్నింగ్స్ ను రహానే ముందుకు నడిపించాడు. వీరిద్దరూ సాధికారికంగా ఆడటంతో స్కోరు బోర్డు పరుగులెత్తింది. పవర్ ప్లేలో 71 పరుగులను పిండుకుంది. రఘువంశీ-రహానే ఇద్దరు కలిసి, ఆతిథ్య బౌలర్లను సమర్థంగా ఎదుర్కొని, మంచి భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. వీరిద్దరూ వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు కొడుతూ స్కోరును నడిపించారు. ఈక్రమంలో అర్థ సెంచరీకి చేరువైన రహానేను సాఖిబ్ హుస్సేన్ బోల్తా కొట్టించాడు. దీంతో 84 పరుగుల భారీ భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత రింకూ సింగ్ (22 నాటౌట్) తో కలిసి ఇన్నింగ్స్ ను నడిపించే ప్రయత్నం చేశాడు రఘువంశీ. ఈక్రమంలో 39 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత రఘువంశీ ఔటైనా.. రింకూ, కామెరూన్ గ్రీన్ (3 నాటౌట్) తో కలిసి జట్టును విజయతీరాలకు చేర్చాడు.



## హాట్ ఫోజులతో హీటెక్కిస్తున్న.. రహానీ శర్మ

# ఆ వ్యసనం నుంచి బయటపడ్డా..



'స్వీయ లోపంబులెరుగుట పెద్ద విద్య' అనేది ఆర్యోక్తి. ఈ నీతిని తూ.చ తప్పక పాటిస్తున్నది శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీ కపూర్. తనలోని లోపాలను సరిచేసుకునే క్రమంలో తాను పడిన కష్టాన్ని ఆమె స్వయంగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది. 'మానసిక వేదన, శారీరక శ్రమ నుంచి బయట పడేందుకు ఒకానొక సందర్భంలో నేనూ మద్యాన్ని ఆశ్రయించాను. నిదానంగా అది వ్యసనంలా మారింది. చివరికి మద్యం సేవించకపోతే ఉండలేని స్థితికి వచ్చేశాను. ఇలాంటి పరిస్థితుల్లో.. మెడిటేషన్ నా జీవితాన్ని మార్చింది. నిద్రలేవగానే శారీరకంగా, మానసికంగా విపరీతమైన అలసట. బలహీనపడుతున్న మానసిక దృఢత్వం.. ఇవన్నీ నాకు అర్థమవుతున్నాయి. చివరకు నా శరీరక స్పందనలు నాకే నచ్చడంలేదు. నాలో వస్తున్న మార్పులన్నీ నన్ను పునఃసమీక్షించుకునేలా చేశాయి. దాంతో ఇక తాగకూడదని గట్టిగా నిర్ణయించుకున్నాను. ఇప్పుడు నా ఆరోగ్యం క్రమంగా కుదురుకున్నది. మానసిక ఉల్లాసానికి మద్యమే మందు కాదు. ఈ విషయం ప్రతిఒక్కరూ గ్రహించాలి' అన్నారు జాన్వీకపూర్.

# కల్కి-2 షూటింగ్‌లో ప్రభాస్ చేరిక




ప్రభాస్ అభిమానులతో, సైన్స్ ఫిక్షన్ జోనర్ సినిమాలను ఇష్టపడే ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టుల్లో ఒకటి 'కల్కి 2898 -2' ప్రాంచైజీ. ఇప్పటికే ఫస్ట్ పార్ట్‌తో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ప్రభాస్-నాగ్ అశ్విన్ టీం ఇక సీక్వెల్‌తో ఎంటర్‌టైన్ చేసేందుకు రెడీ అవుతున్నారని తెలిసిందే. అయితే సీక్వెల్ ఎప్పుడు సెట్స్‌పైకి వెళ్తుందా అని ఎదురుచూస్తున్న మూవీ లవర్స్ కోసం ఇప్పటికే అమితాబ్ బచ్చన్ షూట్‌లో పాల్గొన్నట్టు ఆసక్తికర అప్‌డేట్ ఒకటి బయటకు వచ్చింది. తాజాగా మరో ఆసక్తికర వార్త బయటకు వచ్చింది. హీరో ప్రభాస్ కల్కి సీక్వెల్ షూట్‌లో జాయిన్ అయ్యాడట. ఎక్కువగా నైట్ షూట్స్ ఉండనుండగా.. కొన్ని రోజులపాటు ఈ షెడ్యూల్‌లో పాల్గొనున్నట్టు ఇన్‌సైడ్ టాక్. మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రభాస్ షూట్‌కు సంబంధించి మేకర్స్ ఏమైనా అప్‌డేట్స్ అందిస్తారేమో చూడాలి. కాగా ఫస్ట్ పార్ట్‌లో దీపికా పదుకొనే పోషించిన సుమతి పాత్ర కోసం సీక్వెల్‌లో ఇంకా ఏ నటిన్ని÷నైల్ చేయలేదు మేకర్స్. కమల్ హాసన్‌తోపాటు పలువురు కీలక నటీనటులు సీక్వెల్‌లో కనిపించబోతున్నట్టు తెలుస్తుండగా.. మేకర్స్ నుంచి అప్‌డేట్ రావాల్సి ఉంది. భారీ విజువల్ వండర్‌గా మారిన 'కల్కి'లో ప్రభాస్, దీపికా పదుకొణె, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ లాంటి లీడ్‌యాక్టర్లు నటించడంతో ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా రూ.1000 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. భారీ వీఎఫ్ఎక్స్, యూనిక్ కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల మన్ననలు పొందింది. ఫస్ట్ పార్ట్‌ను తెరకెక్కించిన వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై సీ అశ్వనీదత్ ఈ చిత్రాన్నినిర్మించనున్నారు.

# ప్లీజ్ ఆ సీన్స్ తొలగించండి..




ఈ మధ్యకాలంలో సినీ ఇండస్ట్రీలో అత్యంత ఆసక్తిని రేకెత్తిస్తున్న సినిమాల్లో టాక్సిక్ ఒకటి. ఇందులో కన్నడ స్టార్ యశ్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. అలాగే గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. అయితే తాజాగా కియారా అద్వానీ ఈ చిత్రానికి సంబంధించి కొన్ని కీలక మార్పులు చేయాలని మేకర్స్‌ను కోరినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక సమాచారం రాలేదు. కానీ సోషల్ మీడియాలో మాత్రం కియారా పేరు మారుమోగుతుంది.నెట్టింట వైరలవుతున్న టాక్ ప్రకారం 'టాక్సిక్' చిత్రంలో కొన్ని బోల్డ్ సన్నివేశాలు ఉన్నాయని, వాటిని తొలగించాలని లేదా ఎడిట్ చేయాలని కియారా చిత్ర బృందాన్ని కోరినట్లు సమాచారం. ఈ సినిమాలో కియారా పాత్ర చాలా కీలకంగా ఉంటుందని, అయితే కథలో భాగంగా ఉన్న కొన్ని సీన్ల విషయంలో ఆమె కొంత అసౌకర్యానికి గురైనట్లు తెలుస్తోంది. ముఖ్యంగా యశ్ వంటి పాన్ ఇండియా స్టార్ సరసన నటిస్తున్నప్పుడు, తన ఇమేజ్‌ను దృష్టిలో ఉంచుకుని ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో చర్చ నడుస్తోంది.సాధారణంగా కియారా అద్వానీ గ్లామర్ పాత్రలకు పెట్టింది పేరు అయినప్పటికీ, కథలో ప్రాధాన్యత , బోల్డ్ సన్నివేశాల పట్ల ఆమె ఆచితూచి వ్యవహరిస్తోందని టాక్. ఇప్పుడు 'టాక్సిక్' చిత్రం విషయంలోనూ అదే జరుగుతుంది. ఈ చిత్రం మాఫియా, యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే కథ కావడం వల్ల ఇందులో పలు సన్నివేశాలు ఉండటం సహజం. కానీ, కుటుంబ ప్రేక్షకులు కూడా తన సినిమాను చూడాలనే ఉద్దేశంతో కియారా ఈ విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది.దర్శకురాలు గీతూ మోహన్ దాస్ ఈ విషయంలో కియారా విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. నటీనటుల సౌకర్యం, కథా గమనాన్ని బట్టి అవసరమైన మార్పులు చేసేందుకు మేకర్స్ సిద్ధంగా ఉన్నారట. యశ్ కూడా క్రియేటివ్ విషయంలో , సినిమా అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కేజీఎఫ్ 1, 2 చిత్రాల తర్వాత యశ్ నటిస్తున్న సినిమా కావడంతో టాక్సిక్ పై పాన్ ఇండియా లెవల్లో అంచనాలు నెలకొన్నాయి.





# జైహనుమాన్‌లో అక్షయ్ ఖన్నా ?



టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ తన సినిమాటిక్ యూనివర్స్‌ను హాలీవుడ్ రేంజ్‌లో విస్తరిస్తున్నారు. ప్రస్తుతం అందరి కళ్లు ఆయన ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్న 'జై హనుమాన్'పైనే ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. ఈ సినిమాలో ఒక ఆసక్తికరమైన కాస్టింగ్ అప్‌డేట్‌కు సంబంధించి ఇప్పుడు ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో ఓ వార్త చక్కర్లు కొడుతోంది. బాలీవుడ్ సీనియర్ నటుడు అక్షయ్ ఖన్నా నటనకు ఫిదా అయిన ప్రశాంత్ వర్మ, ఆయనను 'జై హనుమాన్' ప్రాజెక్టులోకి కూడా ఆహ్వానించినట్లు సమాచారం. ఇప్పటికే ప్రశాంత్ వర్మ యూనివర్స్‌లోని 'మహాకాళి' చిత్రంలో అక్షయ్ ఖన్నా 'శుక్రాచార్యుడి' గా కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. అక్షయ్ ఖన్నా పోషించబోయే పాత్రపై ప్రస్తుతం సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. 'మహాకాళి'లో ఆయన చేస్తున్న శుక్రాచార్యుడి పాత్రకు, 'జై హనుమాన్'లోని పాత్రకు ఏమైనా లింక్ ఉంటుందా? లేక ఇది సరికొత్త పాత్రనా? అన్నది మేకర్స్ త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. ప్రశాంత్ వర్మ తన యూనివర్స్‌లోని పాత్రలను ఒకదానితో ఒకటి అనుసంధానించడంలో దిట్ట కాబట్టి, అక్షయ్ ఖన్నా ఎంట్రీ ఈ సినిమాపై అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్తోంది. కేవలం బాలీవుడ్ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకొనే కాకుండా, పాత్రకు ఉన్న వెయిటేజ్ కారణంగానే ఆయనను ఎంపిక చేసినట్లుగా తెలుస్తోంది. క 'జై హనుమాన్'లో కన్నడ స్టార్, 'కాంతార' ఫేమ్ రిషబ్ శెట్టి లీడ్ రోల్ హనుమంతుడుగా చేస్తున్న విషయం తెలిసిందే. రిషబ్ శెట్టి లాంటి పవర్‌ఫుల్ పర్ఫార్మర్‌కు తోడు అక్షయ్ ఖన్నా వంటి వెర్సటైల్ యాక్టర్ తోడవ్వడం సినిమాకు పెద్ద అసెట్ కానుంది. ప్రశాంత్ వర్మ విజన్ ప్రకారం, ఈ యూనివర్స్‌లో ప్రతి పాత్రకు ఒక ప్రాముఖ్యత ఉంటుంది, కాబట్టి అక్షయ్ ఖన్నా రోల్ కూడా కథను మలుపు తిప్పేలా ఉంటుందని టాక్. మొత్తానికి ప్రశాంత్ వర్మ తన సినిమాటిక్ యూనివర్స్‌ను పాన్-ఇండియా లెవల్‌లో స్టాం÷-రగ్‌గా బిల్డ్ చేస్తున్న తీరు చూస్తుంటే, బాక్సాఫీస్ వద్ద మరో సంచలనం ఖాయమనిపిస్తోంది. 'జై హనుమాన్'లో అక్షయ్ ఖన్నా రోల్‌కు సంబంధించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com